# శుభోదయం!

WWW.SUBHODAYAMDAILY.COM

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 293, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) ఆదివారం - 05- జనవరి - 2025


## వాడుక భాషలో 70 శాతం ఆంగ్లపదాలే... తెలియకుండానే తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి



మాట్లాడటం, రాయడం ద్వారా భాషను పరిరక్షించుకోగలమన్న కిషన్ రెడ్డి

తెలుగు భాష కనుమరుగు కాకముందే రక్షించుకోవాలన్న కేంద్రమంత్రి

కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని అమలు చేయాలని సూచన

హైదరాబాద్, : వాడుక భాషలో 30 శాతమే తెలుగు ఉందని, 70 శాతం ఆంగ్ల పదాలే ఉన్నాయని, మనకు తెలియకుండానే తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోందని మిగతా 2లో..

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ తొలి జాబితా... కేజ్రీవాల్‌పై మాజీ ఎంపీ పోటీ



70 అసెంబ్లీ స్థానాలకు 29 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

కేజ్రీవాల్ పోటీ చేస్తున్న న్యూఢిల్లీ నుంచి మాజీ ఎంపీ పర్వేశ్ వర్మను ప్రకటించిన బీజేపీ

సీఎం అతిశీపై మాజీ ఎంపీ రమేశ్ పోటీ మిగతా 2లో..

## ఏపీ పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణకు ముప్పు? ఐఐటీ బృందంతో అధ్యయనానికి రేవంత్ రెడ్డి ఆదేశాలు



నెల రోజుల్లో నివేదిక సిద్ధం చేయాలని ఆదేశం

సమన్వయం కోసం ప్రత్యేక అధికారిని నియమించాలన్న రేవంత్ రెడ్డి

భద్రాచలం ఆలయానికి ముప్పు ఏర్పడే అవకాశాలపై అధ్యయనం చేయనున్న బృందం మిగతా 2లో..

## కారు డోర్ తీసేటప్పుడు జాగ్రత్త




- ఓ వ్యక్తి కారు డోర్ తీయడంతో ప్రమాదానికి గురైన బైక్
- తన కారణంగా ప్రమాదం జరిగినప్పటికీ కారును ముందుకు పోనిచ్చిన వైనం
- దేశ రాజధాని ఢిల్లీలో జనవరి 1 అర్ధరాత్రి జరిగిన ఘటన

హైదరాబాద్, : కారు డోర్ తీసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, లేదంటే ప్రమాదాలు జరుగుతాయంటూ టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను పోస్ట్ చేస్తూ... సూచన చేశారు. ఈ వీడియోలో ఓ వ్యక్తి కారు డోర్ తీయడంతో

# చిట్టినాయుడు కేసులకు భయపడం

- ఇప్పుడు సీఎం అంటే కటింగ్ మాస్టర్" అని కేటీఆర్ ఎద్దేవా
- రేవంత్‌కు పరిపాలన చేతకావడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- "లక్షా 20 వేల కోట్ల రూపాయలు 70 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశారు కేసీఆర్
- హైడ్రా పేరిట పేదల పొట్ట కొట్టడం తప్ప ఏం చేసింది ఈ ప్రభుత్వం




రాజన్న సిరిసిల్ల జిల్లా: ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ మాత్రమే అమలైందని.. రేవంత్‌కు పరిపాలన చేతకావడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. రైతు బంధుకు కొర్రీలు పెడుతున్నారన్న కేటీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డిని కటింగ్ మాస్టర్‌గా అభివర్ణించారు. శనివారం.. సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ భేటిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, పుట్టమధు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "రూ.2 లక్షల రుణమాఫీ అయ్యిందా? లేదా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి ఊరికి పోదామా అంటూ అసెంబ్లీలో అడిగితే సమాధానం లేదు. సర్వశిక్షా అభియాన్ వాళ్ల సమస్యను అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామన్నాడు రేవంత్.. మిగతా 2లో..

## నాంపల్లి కోర్టుకు వచ్చి పూచీకత్తు పత్రాలు సమర్పించిన అల్లు అర్జున్




సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో నిన్న బెయిల్

మామ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి వచ్చిన అల్లు అర్జున్

పూచీకత్తు పత్రాలను న్యాయమూర్తికి సమర్పించిన నటుడు

## ఓ చెత్త కేసు కేటీఆర్‌పై పెట్టారు.. ఈడీపై జగదీష్ రెడ్డి ఫైర్



- వరంగల్ డిక్లరేషన్‌లో మాట్లాడినట్లు రైతు భరోసా అమలు చేయాలి అని డిమాండ్
- కేటీఆర్, హరీష్ రావుపై కేసులు పెట్టాలన్న ఆలోచన తప్ప మరేమీ లేదు

సూర్యాపేట: దేశంలో ప్రధాని మోదీ సహకారంతోనే కేసు నమోదు చేస్తున్నారని ఆరోపించారు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి. కేటీఆర్‌పై పెట్టింది ఒక చెత్త కేసు అంటూ కామెంట్స్ చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నేతలను తెలంగాణ రైతులు నిలదీయాలి అంటూ సూచించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మిగతా 2లో..

## ఢిల్లీ ఎన్నికలు.. బీజేపీ తొలి జాబితా విడుదల




**తొలి జాబితాలో ఇద్దరు మహిళలకు చోటు దక్కింది**

**ఢిల్లీకి స్టేట్ స్టేటస్ వచ్చాక 1993లో జరిగిన తొలి ఎన్నికల్లో బీజేపీ నెగ్గింది**

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ తొలి జాబితా విడుదల చేసింది. మొత్తం 29 మంది పేర్లను ప్రకటించింది. న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఆప్ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై బీజేపీ తరపున పర్వేష్ వర్మ పోటీ చేయబోతున్నారు. అలాగే కల్‌కాజీ నుంచి సీఎం అతిషిపై పోటీకి రమేష్ బిదురిని బీజేపీ రంగంలోకి దింపింది. ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ్ ఈ ఎన్నికల్లో పోటీ చేయబోరంటూ






# చంద్రబాబుగారూ.. ఇదేనా మీ పాలన...

'చంద్రబాబుగారూ.. ఇంత ద్రోహమా? ఇంతటి బరితెగింపా?'

మేనిఫెస్టోపై ఇంతటి తేలిక తనమా?

మీ మోసాలు ఒక్కొటిగా బయటకు..

వరుసగా కేబినెట్ మీటింగ్‌లు జరుగుతున్నా.. పథకాల అమలేదీ?

తల్లికి వందనం, రైతు భరోసా ఎక్కడ?



గుంటూరు,: హామీల అమలులో అలసత్వం.. నిర్లక్ష్యం.. ఎగవేత ధోరణి ప్రదర్శిస్తున్న కూటమి ప్రభుత్వంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. తాజాగా తల్లికి వందనం ఎగవేత కూటమి సర్కార్‌ను నిలదీస్తూ ఎక్స్ ఖాతాలో ఆయన సుదీర్ఘంగా ఓ సందేశం ఉంచారు. "ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై ఇంతటి మిగతా 2లో..

## వాడుక భాషలో 70 శాతం ఆంగ్లపదాలే... తెలియకుండానే తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి

**హైదరాబాద్, :** వాడుక భాషలో 30 శాతమే తెలుగు ఉందని, 70 శాతం ఆంగ్ల పదాలే ఉన్నాయని, మనకు తెలియకుండానే తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కొనసాగుతున్న ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... మాట్లాడటం, రాయడం ద్వారానే భాషను పరిరక్షించగలమన్నారు. పిల్లలతో నిత్యం బాలసాహిత్యం చదివించాలన్నారు. తెలుగు భాష కనుమరుగు కాకముందే రక్షించుకోవాలన్నారు. తెలుగు భాషను బోధనా భాషగా ప్రాచుర్యంలోకి తేవాలన్నారు. పాలన, అధికార వ్యవహారాలు తెలుగు భాషలో జరగాలని సూచించారు. ప్రాథమికస్థాయి వరకు విద్య కూడా తెలుగులో ఉండాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ప్రాంతీయ భాషల పరిరక్షణకు పెద్దల సహకారం అవసరమన్నారు. కోర్టుల్లో వాదనలు, ప్రతివాదనలు తెలుగులో ఉండాలని, కోర్టు తీర్పులు, సినిమాల పేర్లు తెలుగులోనే ఉండాలన్నారు. వికీపీడియాలో తెలుగు వ్యాసాలు రోజురోజుకు పెరుగుతున్నట్లు చెప్పారు. కథలు, వ్యాసాలు ఆడియోల రూపంలో అందుబాటులో ఉన్నాయన్నారు. తెలుగు భాషను డిజిటల్ విభాగంలోనూ క్రోఢీకరించి భావితరాలకు అందించాలన్నారు. డిజిటల్ రంగం పరంగానూ మాతృభాష అభివృద్ధి, సంరక్షణకు దోహదం చేయాలన్నారు.

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ తొలి జాబితా... కేజ్రీవాల్‌పై మాజీ ఎంపీ పోటీ

**న్యూఢిల్లీ,:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంది. అయినప్పటికీ బీజేపీ తొలి జాబితాను విడుదల చేసింది. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై బీజేపీ మాజీ ఎంపీని పోటీకి దింపింది. ఢిల్లీలో 70 అసెంబ్లీ స్థానాలు ఉండగా బీజేపీ 29 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. కేజ్రీవాల్ న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఇక్కడి నుంచి మాజీ ఎంపీ పర్వేశ్ వర్మను అభ్యర్థిగా బీజేపీ ప్రకటించింది. మరోవైపు, ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ మాజీ సీఎం షీలాదీక్షిత్ తనయుడు సందీప్ దీక్షిత్‌ను బరిలోకి దింపుతోంది. పర్వేశ్ వర్మ... ఢిల్లీ మాజీ సీఎం సాహిబ్ సింగ్ తనయుడు. 2014 నుంచి 2024 వరకు వెస్ట్ ఢిల్లీ నుంచి లోక్ సభ సభ్యుడిగా ఉన్నారు. 2014లో 2.68 లక్షల ఓట్ల మెజార్టీ, 2019లో 5.78 లక్షల ఓట్ల రికార్డు స్థాయి మెజార్టీతో పర్వేశ్ వర్మ బీజేపీ నుంచి గెలిచారు. ఇక, కల్కాజీ స్థానం నుంచి ఢిల్లీ సీఎం అతిశీపై బీజేపీ నుంచి మాజీ ఎంపీ రమేశ్ బిధూడి పోటీ చేయనున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి బీజేపీలో చేరిన కైలాశ్ గెహ్లాట్ బిజ్వాసన్ నుంచి బరిలోకి దిగుతున్నారు. గత ఏడాది బీజేపీలో చేరిన ఢిల్లీ కాంగ్రెస్ మాజీ చీఫ్ అరవింద్ సింగ్లీ లవ్లీ గాంధీనగర్ నుంచి పోటీ చేస్తున్నారు.

## ఏపీ పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణకు ముప్పు? ఐఐటీ బృందంతో అధ్యయనానికి రేవంత్ రెడ్డి ఆదేశాలు

**హైదరాబాద్, :** ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు కారణంగా తెలంగాణ మీద పడే ప్రభావాన్ని అధ్యయనం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఐఐటీ హైదరాబాద్ బృందంతో అధ్యయనం చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నెల రోజుల్లో దీనికి సంబంధించి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఐఐటీ హైదరాబాద్ బృందంతో సమన్వయం చేసుకోవడానికి ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు వల్ల భద్రాచలం ఆలయానికి ముప్పు ఏర్పడే అవకాశాలపై ఐఐటీ హైదరాబాద్ బృందం అధ్యయనం చేయనుంది. 2022లో 27 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిన సమయంలో భద్రాచలం వద్ద ముంపునకు గురైనట్లు అధికారులు... ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే ఏపీ ప్రభుత్వం చేపట్టిన గోదావరి-బనకచర్ల మెగా ప్రాజెక్టు అంశాన్ని కూడా అధికారులు... సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. వరద జలాల ఆధారంగా నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు ఇంకా ఎలాంటి అనుమతులు లేవన్నారు. తెలంగాణ అభ్యంతరాలను ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి చెప్పాలని సీఎం సూచించారు.

## కారు డోర్ తీసేటప్పుడు జాగ్రత్త

**హైదరాబాద్, :** కారు డోర్ తీసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, లేదంటే ప్రమాదాలు జరుగుతాయంటూ టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను పోస్ట్ చేస్తూ... సూచన చేశారు. ఈ వీడియోలో ఓ వ్యక్తి కారు డోర్ తీయడంతో ఓ బైక్ ప్రమాదానికి గురవుతుంది. ప్రమాదం జరిగిన తర్వాత పట్టించుకోకుండానే ఆ కారును ముందుకు పోనిస్తారు. ఈ ఘటనపై సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఏమిటీ నిర్లక్యం... కనీస మానవత్వం కూడా లేదా!? నడిరోడ్డుపై వాహనాన్ని ఆపి... కారు డోర్ తెరవడమే తప్పు!! తమ నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగిందనే సోయి లేకుండా... తమకేం పట్టనట్టు ఎలా ప్రవర్తించారో చూడండి. న్యూ ఇయర్ నాడు దేశ రాజదాని న్యూఢిల్లీలో జరిగిందీ ప్రమాదం" అంటూ సజ్జనార్ రాసుకొచ్చారు. కారు డోర్ తీసేటప్పుడు జాగ్రత్త! వెనుక నుంచి వస్తున్న వాహనదారులను గుర్తించి కారు డోర్ తీయండని సూచించారు. తొందరంగా వెళ్లాలనే హడావుడిలో ఇలా అజాగ్రత్త, నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాదాలకు కారణం కావొద్దని సూచించారు.

## నాంపల్లి కోర్టుకు వచ్చి పూచీకత్తు పత్రాలు సమర్పించిన అల్లు అర్జున్

**హైదరాబాద్, :** సినీ నటుడు అల్లు అర్జున్ ఈరోజు మధ్యాహ్నం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. నాంపల్లి కోర్టులో బెయిల్ పూచీకత్తు పత్రాలను న్యాయమూర్తికి సమర్పించారు. ఆ తర్వాత అక్కడి నుంచి నేరుగా తన ఇంటికి వెళ్లారు. తన మామ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి ఆయన నాంపల్లి కోర్టుకు వచ్చారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్ ఏ11గా ఉన్నారు. గత నెలలో పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందారు. ఆమె కొడుకు తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్‌లోని కిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ కేసుకు సంబంధించి చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు. ఆ తర్వాత హైకోర్టు ఆయనకు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. నిన్న నాంపల్లి కోర్టు షరతులతో కూడిన పూర్తిస్థాయి బెయిల్ ఇచ్చింది. రూ.50 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. సాక్షులను ప్రభావితం చేయవద్దని, కేసును ప్రభావితం చేసేలా వ్యాఖ్యలు చేయవద్దని షరతులు విధించింది. రెండు నెలల పాటు ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీసుల ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది. ఈ క్రమంలో ఈరోజు నాంపల్లి కోర్టుకు వచ్చిన అల్లు అర్జున్ పూచీకత్తు పత్రాలు సమర్పించారు.

## ఓ చెత్త కేసు కేటీఆర్‌పై పెట్టారు.. ఈడీపై జగదీష్ రెడ్డి ఫైర్

మొదటి పేజీ తరువాయి

కేటీఆర్‌పై పెట్టింది ఒక చెత్త కేసు అంటూ కామెంట్స్ చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నేతలను తెలంగాణ రైతులు నిలదీయాలి అంటూ సూచించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతూ..'కేటీఆర్‌పై పెట్టిన కేసు దేశంలోనే చెత్త కేసు. బడే భాయ్.. చోటే భాయ్ కలిసి కేసులు పెట్టారు. మోదీ సహకారంతోనే కేసులు పెడుతున్నారు. బ్లాక్ మనీ వైట్ చేస్తే.. ఈడీ రావాలి. అంతేకానీ.. తీసుకున్నది ఎవడో తెలియదు కానీ.. ఇచ్చినోడి మీద కేసులా?. ఇది తాత్కాలిక ఆనందం.. శునాకనందం తప్ప ఏమీలేదు. రైతు భరోసా ఎగొట్టడానికే కేసుల వ్యవహారం చర్చ తీసుకువచ్చారు. పక్కదారి పట్టించడానికే ఇవన్నీ చేస్తున్నారు. రైతులు కాంగ్రెస్ నేతలను నిలదీయండి. ఈ ప్రభుత్వం అన్ని రంగాల ప్రజలను మోసం చేసింది. ఇతర రాష్ట్రాల ఎన్నికల కోసం రాష్ట్రానికి అప్పులు చేసి ఇచ్చారు. వరంగల్ డిక్లరేషన్‌లో మాట్లాడినట్టు రైతు భరోసా అమలు చేయాలి అని డిమాండ్ చేశారు. చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. దేశంలోనే చెత్త సీఎం రేవంత్ రెడ్డి. గ్రామాల్లో పర్యటిస్తే రేవంత్‌కు అసలు విషయం తెలుస్తోంది. ఆయనపై దాడి చేసిన ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. రైతులు, తెలంగాణ ప్రజలను మోసం చేసే పనిలో కాంగ్రెస్ ఉంది. కేటీఆర్, హరీష్ రావుపై కేసులు పెట్టాలన్న ఆలోచన తప్ప మరేమీ లేదు. కాంగ్రెస్ నేతలు చివరకు సెక్రటేరియట్ కూడా అమ్ముకుంటారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే లోకల్ బాడీ ఎలక్షన్స్ నిర్వహించాలి' అంటూ సవాల్ విసిరారు.

## ఢిల్లీ ఎన్నికలు.. బీజేపీ తొలి జాబితా విడుదల

మొదటి పేజీ తరువాయి

అలాగే కల్‌కాజీ నుంచి సీఎం అతిషిపై పోటీకి రమేష్ బిదురిని బీజేపీ రంగంలోకి దింపింది. ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ్ ఈ ఎన్నికల్లో పోటీ చేయబోరంటూ తొలి నుంచి ఊహాగానాలు వినిపిస్తున్నాయి . ఈలోపు.. తొలి జాబితాలో ఆయన పేరు లేకపోవడం గమనార్హం. తొలి జాబితాలో ఇద్దరు మహిళలకు చోటు దక్కింది. రేఖా గుప్తా, సుశ్రీ కుమారి రింకూలకు కమలం పార్టీ తొలి జాబితాతో అవకాశం కల్పించింది. ఢిల్లీ మాజీ మంత్రి కైలాష్ గెహ్లాట్ కిందటి ఏడాది నవంబర్‌లో బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే. గత రెండు ఎన్నికల్లో నజఫ్‌గఢ్ నియోజక వర్గం నుంచి పోటీ చేసి నెగ్గిన కైలాష్.. ఈసారి బీజేపీ తరపున బిజ్వాసన్ నుంచి పోటీ చేయబోతున్నారు. అలాగే పదేళ్లపాటు షీలా దీక్షిత్ కేబినెట్‌లో మంత్రిగా పని చేసిన అరవిందర్ సింగ్ లవ్లీ.. కిందటి ఏడాది బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే. ఆయన ఈ ఎలక్షన్స్‌లో ఈస్ట్ ఢిల్లీ గాంధీనగర్ నుంచి పోటీ చేయబోతున్నారు. ఢిల్లీ అసెంబ్లీ లో మొత్తం 70 స్థానాలు ఉన్నాయి. ఇప్పటికే ఆమ్ ఆద్మీ పార్టీ అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ఢిల్లీ అసెంబ్లీ ఏడవది. దీని గడువు ఫిబ్రవరి 15వ తేదీతో ముగియనుండగా.. ఆలోపు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఢిల్లీకి స్టేట్ స్టేటస్ వచ్చాక 1993లో జరిగిన తొలి ఎన్నికల్లో బీజేపీ నెగ్గింది. అయితే ఐదేళ్ల పాలనలో ముగ్గురు సీఎంలను మార్చింది. ఆపై జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నెగ్గింది. షీలా దీక్షిత్ సారథ్యంలో హస్తం పార్టీ హ్యాట్రిక్ పాలన సాగించింది. ఇక.. 2013 నుంచి ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో కొనసాగుతోంది. దీంతో.. ఈసారి ఎలాగైనా హస్తినను చేజిక్కించుకోవాలని బీజేపీ భావిస్తోంది. మరోసారి అధికారం దక్కించుకోవాలని ఆప్ భావిస్తోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా ఈసారి అధికారంపై కన్నేసింది. హర్యానా ఎన్నికల తర్వాత ఇండియా కూటమి మిత్రపక్షాలైన ఆప్-కాంగ్రెస్‌లు మరోసారి ఢిల్లీ ఎన్నికల ముక్కోణపు పోటీలో తలపడనున్నాయి.

# చిట్టినాయుడు కేసులకు భయపడం

మొదటి పేజీ తరువాయి



"రూ.2 లక్షల రుణమాఫీ అయ్యిందా? లేదా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి ఊరికి పోదామా అంటూ అసెంబ్లీలో అడిగితే సమాధానం లేదు. సర్వశిక్షా అభియాన్ వాళ్ల సమస్యను అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామన్నాడు రేవంత్.. ఏమైంది?. కాంగ్రెస్ మాట తప్పిన ప్రభుత్వం. ఎప్పుడైనా నాట్లు పడేటప్పుడు పడాల్సిన రైతుబంధు.. ఓట్లు పడ్డప్పుడు వేసిన ఘనత కాంగ్రెస్‌ది. రైతు ప్రమాణ పత్రం రాయడమేంటి..?" అంటూ కేటీఆర్ నిలదీశారు. "లక్షా 20 వేల కోట్ల రూపాయలు 70 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశారు కేసీఆర్. రైతును బద్నాం చేసే మాట, దొంగగా చిత్రీకరించేలా ఏడు వేల కోట్ల రూపాయలు మళ్లించారని మాట్లాడిండు రేవంత్. రెండో పంట వేయని రైతులను తప్పుగా చిత్రీకరిస్తోంది రేవంత్ ప్రభుత్వం. టీచర్ అయితే రైతుబంధు కట్ అంటుండు రేవంత్. ఇప్పుడు సీఎం అంటే కటింగ్ మాస్టర్" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. "పర్రె మేడిగడ్డకు పడలే.. రేవంత్ పుర్రెకు పడ్డది. మేడిగడ్డ బ్యారేజ్ విషయంలో కాంగ్రెసే ఏదో దొంగచాటుగా చేస్తోందనేది నా అనుమానం. స్థానిక సంస్థల ఎన్నికల సంవత్సరం కాబోతోంది ఈ ఏడాది. కాబట్టి ప్రేక్షకపాత్రకు పరిమితం కాకుండి. కేసులైనా భయపడకండి. చిట్టినాయుడు ఏం పీకలేదు. చిల్లర మిల్లర రాతలు రాయించేవారినీ వదిలిపెట్టం. బాక్సింగ్‌లో కిందపడ్డా నిలబడి కొట్లాడేటోడే వీరుడు. కాంగ్రెస్ 8, బీజేపీ 8 ఎంపీలైన్రు కానీ వచ్చింది గుండు సున్నా. కేసీఆర్ ఒక రోజు దేశంలో చక్రం తిప్పే రోజు ముందుంది కాంగ్రెస్ నాడు బీఆర్ఎస్ ప్రభుత్వానికి 369 కోట్ల రెవెన్యూ మిగులుతో అప్పజెప్పితే.. మనం దిగిపోయేనాడు 5 వేల 564 కోట్ల మిగులుతో కాంగ్రెస్‌కు అప్పజెప్పాం. రెవెన్యూ మిగులు విషయంలో ముఖ్యమంత్రిదో మాట, ఉప ముఖ్యమంత్రిదో మాట. పదేళ్లలో 4 లక్షల 17 వేల కోట్లు మనం అప్పు చేస్తే.. కాంగ్రెస్ ఒక ఏడాదిలో 1 లక్షా 37 వేల కోట్ల అప్పుజేసింది. మేం చేసిన అప్పుల వల్ల జరిగిన అభివృద్ధి గురించి మేం చెప్తాం.. మీరు చెప్పగలరా?. హైడ్రా పేరిట పేదల పొట్ట కొట్టడం తప్ప ఏం చేసింది ఈ ప్రభుత్వం?. ఢిల్లీకి పంపుతున్నారు పైసలన్నీ. తెలంగాణా ఢిల్లీకి ఏటీఎం అయిపోయింది. కొడంగల్ భూములివ్వని కేసులో కూడా నన్ను ఇరికించే యత్నం చేశాడు. ఆరు కేసుల్లో ఎలా ఇరికిద్దామా అనే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వానిది. వాళ్లు కేసుల గురించి ఆలోచించని.. మనం రైతుల గురించి ఆలోచిద్దాం. త్వరలో సభ్యత్వ నమోదు ప్రారంభించి బూత్ కమిటీ నుంచి రాష్ట్ర కమిటీలు వేసుకుందాం. రైతుభరోసాపై గ్రామాల్లో నాయకులంతా చర్చ పెట్టాలి. కోటి ఆరు లక్షల మంది నుంచి దరఖాస్తులు తీసుకుని ఏం చేసినట్టు?. మళ్ళీ ప్రమాణపత్రాలెందుకు?" అంటూ కేటీఆర్ విమర్శించారు.

# చంద్రబాబుగారూ.. ఇదేనా మీ పాలన...

మొదటి పేజీ తరువాయి



తాజాగా తల్లికి వందనం ఎగవేత కూటమి సర్కార్‌ను నిలదీస్తూ ఎక్స్ ఖాతాలో ఆయన సుదీర్ఘంగా ఓ సందేశం ఉంచారు. "ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై ఇంతటి బరితెగింపా? మేనిఫెస్టోపై ఇంతటి తేలిక తనమా? ప్రజలకు ఇచ్చిన మాటను అమలు చేయకుండా టేక్ ఇట్ గ్రాంటెడ్‌గా తీసుకుంటారా? లక్షలమంది తల్లులకు, పిల్లలకు, రైతులకు ఇంతటి ద్రోహం తలపెడతారా?. అధికారంలోకి వస్తే తల్లికి వందనం అని, ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఏడాదికి రూ.15వేలు చొప్పున ఇస్తామన్నారు, అధికారంలోకి రాగానే అంతకుముందు మేం ఇస్తున్న అమ్మ ఒడి పథకాన్ని సైతం ఆపేశారు. వరుసగా కేబినెట్ సమావేశాలు జరుగుతున్నాయి కాని, తల్లికి వందనం పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారో నిర్దిష్టంగా చెప్పలేదు. తీరా ఈ ఏడాదికి ఇవ్వమని కేబినెట్లో తేల్చిచెప్పేశారు. ఇంతకన్నా మోసం ఏమైనా ఉంటుందా? ఇంతకన్నా పచ్చి దగా ఏమైనా ఉంటుందా?. చంద్రబాబుగారూ%ో% ఎన్నికల వేళ మీరు, మీ కూటమి నాయకులు రాష్ట్రంలోని ప్రతిచోటా తల్లికి వందనంపై చేసిన ప్రచారం అంతా ఇంతాకాదు. ఇంటింటికీ తిరిగి కనిపించిన ప్రతి పిల్లాడినీ పట్టుకుని నీకు రూ.15వేలు, నీకు రూ.15వేలు, నీకు రూ.15వేలు అన్నారు. ఇద్దరుంటే రూ.30వేలు ఇస్తామన్నారు, ముగ్గురు ఉంటే రూ.45వేలు ఇస్తామన్నారు. నలుగురు ఉంటే రూ.60వేలు ఇస్తామన్నారు. ప్రజలకు మీరుచేసిన వాగ్దానం, మీరు చెప్పిన మాటలు ఆడియో, వీడియోల రూపంలో సాక్ష్యాధారాలుగా ప్రతిఒక్కరి సెల్‌ఫోన్‌లో ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో 44.48 లక్షల మంది తల్లులకు, దాదాపు 84 లక్షల మంది పిల్లలకు, రూ.26,067 కోట్లను మేము అందించి, అత్యంత విజయవంతంగా అమలుచేసిన అమ్మ ఒడిని ఆపేసినా, మీరు ఇస్తామన్న పథకం వస్తుందేమోనని బడికి వెళ్లే ఆ పిల్లలు, వారి తల్లులు ఈ 7-8నెలలుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. చివరకు వారి ఆశలపై నీళ్లు జల్లి, ఈ ఏడాది ఇవ్వమని నిస్సిగ్గుగా చెప్తున్నారు. ప్రజలకు ఒక మాట ఇచ్చి, దాన్ని నమ్మించి, వారి ద్వారా అధికారాన్ని తీసుకుని, ఇప్పుడు ఇవ్వలేమంటూ ఎలాంటి సంకోచంలేకుండా చెప్తున్నారు. మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేయడం, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కడం మీకు అలవాటుగా మారిపోయింది చంద్రబాబుగారూ ఇక రైతు భరోసా తీరు కూడా అలానే ఉంది. ఈ ఏడాది ఖరీఫ్, రబీ రెండు సీజన్లు అయిపోతున్నా ఇవ్వకుండా గడిపేశారు. అదిగో, ఇదిగో అంటూ లీకులు ఇస్తున్నారు కాని, ఇప్పటివరకూ రైతులకు పెట్టుబడి సహాయం కింద ఒక్కపైసా ఇవ్వలేదు. అధికారంలోకి వచ్చిన ఆ ఏడాదే 2019 అక్టోబరులో ప్రారంభమై, అప్పటినుంచి క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం రూ.13,500 చొప్పున 53.58 లక్షల రైతుల చేతిలో, రూ.34,378కోట్లు మేము పెట్టాం. కేంద్రం ఇచ్చేది కాకుండా మీరు ఏడాదికి రూ.20వేలు ఇస్తామన్నారు. ఇప్పుడు ఖరీఫ్ అయిపోయిందీ, రబీకూడా అయిపోయింది. ఒక్కపైసా ఇవ్వలేదు. ఇన్ని కేబినెట్ మీటింగ్‌లు పెట్టుకున్నా ఎప్పుడు ఇస్తామో చెప్పడంలేదు. ఇది రైతులను నిలువెల్లా మోసం చేయడం కాదా? రైతులకు పెట్టుబడి సహాయం లేదు, కనీస మద్దతు ధరా అందడంలేదు, ఉన్న ఉచిత పంటలబీమాను రద్దుచేశారు, ఆర్బీకేలను నిర్వీర్యంచేశారు. సంక్షోభంలో ఎవరైనా రైతులు దురదృష్టవశాత్తూ ఆత్మహత్య చేసుకుంటే కనీసం ఆ కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందడంలేదుకదా, కనీసం పరామర్శకు కూడా నోచుకోవడం లేదు. ప్రతి పిల్లాడికి రూ.15వేలు చొప్పున ఎంతమంది పిల్లలు ఉంటే, అంతమందికీ అన్న తల్లికి వందనం అయినా మోసమే, రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20వేలు ఇస్తామన్నదీ మోసమే, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ రూ.18వేలు అయినా మోసమే, నిరుద్యోగభృతి కింద ప్రతి పిల్లాడికీ రూ.36వేలు అయినా మోసమే, 50 సంవత్సరాలు నిండిన ప్రతి అక్కకూ రూ.48వేలు అయినా మోసమే, ఇంటింటికీ సేవలు అందిస్తూ మంచికి అర్థం చెప్పిన వాలంటీర్లకూ మీరు చేసింది మోసమే, ఈ మోసాలు అన్నింటికీ తోడు, మీ పాలనలో ప్రజలపై ఛార్జీలతో బాదుడే బాదుడు కనిపిస్తోంది. ప్రతి అడుగులోనూ స్కాంలే. ఇసుకను వదలడంలేదు, మద్యాన్ని వదలడంలేదు. చంద్రబాబుగారూ.. రోజులు గడుస్తున్నకొద్దీ, మీరు చేస్తున్న మోసాలు ఒక్కొక్కటీ బయటకు వస్తూనే ఉన్నాయి. ఇవి ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తున్నాయి. ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి, వారి గొంతుకై నిలుస్తుంది. ప్రజలకు మీరు ఇచ్చిన వాగ్దానాల అమలుకోసం వారి తరఫున నిలబడుతుంది" అని పేర్కొన్నారాయన.

## చంద్రబాబు, లోకేశ్ బాధ్యత కలిగిన వారు కాబట్టి అలాంటి పనులు చేయలేదు

మొదటి పేజీ తరువాయి



ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనా విధానానికి అనుగుణంగా విద్యార్థులంతా మెరుగైన ఫలితాలు సాధించి స్వర్ణాంధ్రప్రదేశ్ లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "ప్రభుత్వ విద్యకు మళ్లీ పూర్వవైభవం తెచ్చేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారు. జూనియర్ కాలేజిల్లో మధ్యాహ్న భోజన పథకం మొదటిసారిగా అమలుగా చేస్తున్నది ఏపీలో మాత్రమే. ఇందుకోసం ప్రభుత్వం రూ.90 కోట్లు ఖర్చు చేస్తోంది. ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషిచేస్తున్నాం. మార్కెట్లో గుడ్ల రేటు తగ్గినా, వీళ్లు (వైసీపీ) రేటు తగ్గించకుండా గతంలో ఎంతో అవినీతికి పాల్పడ్డారు. గుడ్లపై కూడా స్టాంపు వేసుకున్నారు. వారి పేర్లతో దీవెనలు, కానుకలని పేర్లు పెట్టుకున్నారు. వారి సొంత ఖజానానుంచి ఏమైనా ఇచ్చారా? ఇప్పుడు చంద్రబాబు, లోకేశ్ వారి పేర్లు పెట్టుకున్నారా? బాధ్యత కలిగిన వారు కనుక ఆ పనులు చేయలేదు. తల్లిదండ్రులు, గురువు, దేవుడికి మాత్రమే దీవెనలు ఇచ్చే అర్హతలు ఉన్నాయి. తాము దైవాంశ సంభూతులమని ఎవరన్నా అనుకుంటే వారిని దూరంగా ఉంచండి. అటువంటి వ్యక్తులు, శక్తులను దూరంగా పెట్టండి. రాష్ట్రంలో యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్ సెన్సస్ చేస్తున్నారు. మీ గురించి ఆలోచించే డైనమిక్ మంత్రి (నారా లోకేశ్) ఉన్నారు. నైపుణ్య శిక్షణ ఇచ్చి, రాబోయే రోజుల్లో మీ కాళ్లపై మీరే నిలబడేలా కృషి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానం రాబోయే రోజుల్లో విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తుంది. ఇప్పుడు మనం నాలెడ్జి ప్రాక్టీషనర్స్ గా ఉన్నాం, నాలెడ్జి ప్రొడ్యూసర్స్ గా లేము. రాబోయే రోజుల్లో ప్రొడ్యూసర్స్ గా తయారు కావాల్సి ఉంది. గూగుల్, యాపిల్ వంటి సంస్థలు ఇక్కడే ఏర్పాటవుతాయి" అని మంత్రి సత్యకుమార్ పిలుపునిచ్చారు. ఇక, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో 34 లక్షల మంది విద్యార్థుల ఆరోగ్య వివరాలను హెల్త్ కార్డుల్లో పొందుపరుస్తున్నామని సత్యకుమార్ తెలిపారు. పిల్లలు ఎనీమియా బారిన పడకుండా ఆర్ కె ఎస్ కె కార్యక్రమాన్ని ప్రారంభించామని వెల్లడించారు.

లోకేశ్ ను చూసి నేర్చుకోవాలి: ఎంపీ కేశినేని చిన్ని

ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ... మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి నివసించే ప్రాంతంలో మధ్యాహ్న భోజన ప్రారంభించడం హర్షణీయం అన్నారు. "స్వర్గీయ ఎన్టీఆర్ నాడు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు... ఇవాళ ఆయన మనవడు లోకేశ్ ఇంటర్ విద్యార్థులకు ప్రారంభించడం ఆనందంగా ఉంది. విద్యాశాఖలో అనూహ్య మార్పులు తెస్తున్న లోకేశ్ కు అభినందనలు. ఎంత ఎదిగితే అంత ఒదిగి ఉండాలనే సూత్రాన్ని విద్యార్థులంతా లోకేశ్ ను చూసి నేర్చుకోవాలి. ఆయన అమెరికా వెళ్లి గూగుల్, టెస్లా వంటి కంపెనీల చుట్టూ తిరిగారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు" అని కొనియాడారు.

## పిఠాపురంలో జనసేన మహాసభలు... తేదీలు ఇవే!

**అమరావతి,:** జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ నిర్వహణ వేదిక, తేదీలు ఖరారు అయ్యాయి. జనసేన పార్టీ అధినేత, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్ తను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోనే మార్చి 12, 13, 14 తేదీల్లో ప్లీనరీ నిర్వహించాలని నిర్ణయించారు. జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో ప్లీనరీ సన్నాహాలపై శుక్రవారం విజయవాడలో కోర్ కమిటీ సమావేశమై వివిధ అంశాలపై చర్చించింది. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పార్టీ ప్రస్థానంలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా పవన్ బలంగా నిలబడ్డారని, దాంతో కూటమి ప్రభుత్వ స్థాపనలో జనసేన పాత్ర క్రియాశీలకమైందని చెప్పారు. ఈ క్రమంలో పార్టీ ఆవిర్భావ వేడుకలను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్లీనరీ నిర్వహణకు వివిధ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలు, పవన్ ఆశయాలు ప్రజల్లో మరింతగా తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, మేధావుల నుంచి ప్లీనరీలో సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. మార్చి 12వ తేదీ ఉదయం ప్లీనరీ ప్రారంభోత్సవం ఉంటుందని, 14న బహిరంగ సభ జరుగుతుందని నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## విద్యాశాఖలో నేను తీసుకున్న మొదటి నిర్ణయం ఇదే: మంత్రి నారా లోకేశ్




**అమరావతి,:** ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేడు రాష్ట్ర వ్యాప్తంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. విజయవాడలోని పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా ప్రారంభించిన ఆయన, కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తాను తీసుకున్న తొలి నిర్ణయం... 'విద్యాశాఖలో రాజకీయ జోక్యం ఉండకూడదు' అనివెల్లడించారు. విద్యాశాఖకు సంబంధించిన ఏ కార్యక్రమంలోనూ తమ ఫొటోలు ఉండవని, 'విద్యాశాఖలో రాజకీయ జోక్యం ఉండకూడదు' అని వెల్లడించారు. విద్యాశాఖకు సంబంధించిన ఏ కార్యక్రమంలోనూ తమ ఫొటోలు ఉండవని, తమ పార్టీ రంగులు ఉండవని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఇచ్చే మెటీరియల్ లోనూ తమ పేర్లు ఉండవని తెలిపారు. సమాజం కోసం ఎవరిని స్ఫూర్తిగా తీసుకుని మనం మంచి పనులు చేయాలనుకుంటామో, వారి పేర్లు పెట్టామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. "డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్కూల్ కిట్లు అందజేశాం. ఇవాళ డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకం తీసుకువచ్చాం. గతంలో ఏదైనా ప్రభుత్వ కార్యక్రమం జరిగితే, ముందుగా పట్టుకెళ్లేది విద్యార్థులనే. ముఖ్యమంత్రి కార్యక్రమం జరిగితే పిల్లలు వెళ్లాలి, మంత్రి ప్రోగ్రామ్ జరిగితే పిల్లలు వెళ్లాలి... కానీ నేను విద్యాశాఖ మంత్రిగా రాగానే... మన పిల్లలు ఎక్కడికీ వెళ్లరు, కేవలం చదువుకుంటారు అని ఆదేశాలు జారీ చేశాను. అంతేకాదు, స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో కేవలం జాబ్ మేళాలు మినహా మరే ఇతర కార్యక్రమాలు జరిపేందుకు వీల్లేదని చెప్పాను. ఇక, ఉపాధ్యాయులు గతంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారిపై యాప్ ల భారం విపరీతంగా ఉంది. ఆ యాప్ ల భారం తొలగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది" అని మంత్రి నారా లోకేశ్ వివరించారు.

## టీడీపీ సభ్యత్వ నమోదు పెద్ద డ్రామా: అమర్నాథ్



విశాఖపట్నం: టీడీపీ సభ్యత్వ నమోదులో డ్రామా నడుస్తోందని ఎద్దేవా చేశారు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్. పట్టాలు ఇస్తాం, ఆధార్ కార్డులు ఇప్పిస్తామంటూ అడ్రస్‌లు తీసుకుని టీడీపీ సభ్యత్వమంటూ ప్రచారం చేసుకుంటున్నారని అమర్నాథ్ ఆరోపించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ విశాఖలో మీడియాతో మాట్లాడుతూ..'టీడీపీ సభ్యత్వ నమోదుపై నారా లోకేష్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. భీమిలి నియోజకవర్గంలోని ముచ్చర్ల గ్రామంలో సభ్యత్వంపై తప్పుడు ప్రచారం జరుగుతోంది. ముచ్చర్లలో 1400 మంది ఓటర్లు టీడీపీ సభ్యత్వం తీసుకున్నట్టు ప్రచారం చేస్తున్నారు. ముచ్చర్లలో నూటికి నూరు శాతం టీడీపీ సభ్యత్వం పెద్ద అబద్ధం. లేనిది ఉన్నట్టు సృష్టించి టీడీపీ మద్దతు మీడియా ప్రచారం చేస్తోంది. ముచ్చర్లలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. గ్రామంలో వైఎఎస్సార్‌సీపీతో పాటు జనసేన, బీజేపీ పార్టీలు లేవా?. ముచ్చర్ల గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ పదవులను వైఎస్సార్‌సీపీ గెలుచుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో 1350 ఓట్లకు గాను టీడీపీకి వైఎస్సార్‌సీపీకి మధ్య ఓట్ల తేడా 150 ఓట్లు మాత్రమే ఉంది. భీమిలీలో వైఎస్సార్‌సీపీకి బలమైన కేడర్ ఉంది. 100 శాతం సభ్యత్వం జరిగిందని లోకేష్ ముచ్చెర్ల గ్రామానికి ఎలా వస్తారు?. సభ్యత్వంపై తప్పుడు లెక్కలు చెప్పడం మంచి పద్ధతి కాదు. కొన్ని చోట్ల బెదిరించి సభ్యత్వం నమోదు చేస్తున్నారు. పక్క రాష్ట్రాల వారికి సభ్యత్వం ఇస్తున్నారు. సంక్షేమ పథకాలిస్తాం.. పట్టాలు ఇప్పిస్తాం, ఆధార్ కార్డులు ఇప్పిస్తామంటూ అడ్రస్‌లు తీసుకుని టీడీపీ సభ్యత్వమంటూ ప్రచారం చేసుకుంటున్నారు. 600 ఎకరాల భూమిని కొట్టేయడానికి లోకల్ టీడీపీ నేత కుట్ర పన్నారు. రాష్ట్రంలో బడ్డీ కొట్టు వ్యాపారుల దగ్గర నుంచి రియల్ ఎస్టేట్ వరకు కూటమి నేతలు దోచుకుంటున్నారు. గత ఏడు నెలల ప్రవచనాలు చెబుతున్న అనితా గురించి టీడీపీ గెజిట్ పేపర్ ఈనాడులో వచ్చింది. టీటీడీ లెటర్ అమ్ముకునే స్థితికి హోం మంత్రి అనిత పేషీ చేరుకుంది. సనాతన ధర్మం గురించి మాట్లాడే నాయకులు టీటీడీ లెటర్ గురించి ఏం చెబుతారు మరి?. టీటీడీ లడ్డు గురించి రాద్ధాంతం చేసిన నేతలు ఏం చేస్తున్నారు?. మంత్రులు నెల వారీగా వసూలు చేస్తున్నారు అని కామెంట్స్ చేశారు. విశాఖలోని ముచ్చర్లలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. పట్టాలు ఇప్పిస్తాం, ఆధార్ కార్డులు ఇప్పిస్తామంటూ అడ్రస్‌లు తీసుకుని టీడీపీ సభ్యత్వమంటూ ప్రచారం చేసుకుంటున్నారు. 600 ఎకరాల భూమిని కొట్టేయడానికి లోకల్ టీడీపీ నేత కుట్ర పన్నారు. రాష్ట్రంలో బడ్డీ కొట్టు వ్యాపారుల దగ్గర నుంచి రియల్ ఎస్టేట్ వరకు కూటమి నేతలు దోచుకుంటున్నారు' అని కామెంట్స్ చేశారు.

## విభిన్న ప్రతిభావంతులను ఆదరించండి :ఎంపీడీవో జయమణి

### ఘనంగా ప్రపంచ బ్రెయిలీ దినోత్సవ వేడుకలు



సింగరాయకొండ, మండల రిపోర్టర్ – పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్): సింగరాయకొండ మండలం స్థానిక ఆర్ఎస్ పాఠశాల ప్రాంగణంలో ఉన్న భవిత కేంద్రంలో ఈరోజు ప్రపంచ బ్రెయిలీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల పరిషత్ అభివృద్ధి అధికారిని శ్రీమతి జయమణి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈరోజు ఈ ప్రత్యేక అవసరాలు గల పిల్లలతో గడపటం ఆనందంగా ఉందని, పిల్లలను అల్లారు ముద్దుగా చూసుకుంటున్న తల్లిదండ్రులను అభినందించారు.అదేవిధంగా విభిన్న ప్రతిభావంతులుగా ఉన్న పిల్లలను సాధారణ పాఠశాలలో చేర్పించండని ,వీరి కొరకు ప్రత్యేక శిక్షణ పొందిన,ఉపాధ్యాయులను మరియు ఫిజియోథెరపి డాక్టర్లను నియమించడం జరిగిందని, ఈ అవకాశం వినియోగించుకోవాలని తెలియజేశారు.జీవితంలో విజయాలకు అంగవైకల్యం ఆటంకం కాదని, బ్రెయిలీ లిపిలో చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్ళాలని అన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని గాయత్రి మేనరికపు సంబంధాల పెళ్లిళ్లు చేసుకోవడం వలన ఎక్కువ శాతం అంగవైకల్యం ఉన్న పిల్లలు పుడతారని, దయచేసి మేనరకపై వివాహాలు నివారించమని అన్నారు.హైకోర్టు న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కలెక్టర్ వారు అమలు చేస్తున్న బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని 14 సంవత్సరాల పిల్లలు బడిలోనే ఉండేలా చూడాలని అన్నారు.కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని గాయత్రి,ఉర్దూ పాఠశాల పనిచేస్తున్న షేక్ భానులను శాలువాతో సన్మానించారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఎంపీడీవో జయమణిని సన్మానించారు. పాత్రికేయులు బొచ్చు కోటేశ్వరరావు విద్యార్థులకు దుప్పట్లు సమకూర్చగా శ్రీనివాస్ రెడ్డి చిన్నారులకు మరియు వారి తల్లిదండ్రులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ,ఆర్.ఎస్.పాఠశాల ప్రధానోపాధ్యాయిని రమాదేవి, ఆర్టీసీ కండక్టర్ బ్రహ్మయ్య,భవిత కేంద్రం సిబ్బంది పి.రామిరెడ్డి, టి.కోటయ్య మరియు కండక్టర్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థికి మధ్యాహ్న భోజనం

## డొక్కా సీతమ్మ భోజనం పథకం అభినందనీయం, పేద విద్యార్థికి ఒక వరం : ఎరిక్షన్ బాబు



ఎర్రగొండపాలెం, మండల రిపోర్టర్ – నారాయణ (శుభోదయం న్యూస్): యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ



మధ్యాహ్న భోజన పథకాన్ని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొని ప్రారంభించారు. 5 – 18 సంవత్సరాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలనేదే సీఎం చంద్రబాబు , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లక్ష్యమని ఎరిక్షన్ బాబు తెలిపారు. ఈ పథకం ద్వారా పేద విద్యార్థి ఆకలి తీరడమే కాకుండా, డ్రాపవుట్స్, హాజరు తగ్గటం వంటి సమస్యలు ఉండవని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ పథకం ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, మండల విద్యాశాఖ అధికారులు, టీడీపీ కూటమి నాయకులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# పొందూరులో జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సు



టంగుటూరు మండల రిపోర్టర్ – వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) : టంగుటూరు మండలం పొందూరు గ్రామంలో శనివారం గ్రామ రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో టంగుటూరు మండల రెవెన్యూ అధికారి జి ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్య సర్వే కొరకు అయినట్లయితే 30 రోజుల్లో పరిష్కారమవుతుందని, ము టేషన్స్ అయినట్లయితే 60 రోజుల్లో పరిష్కారమవుతుందన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ రెవెన్యూ సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని ప్రజలంతా ఉపయోగించుకుని సత్వరమే తమ సమస్యలను పరిష్కరించుకోవా లన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ హనుమంతరావు, మండల సర్వేయర్ నందయ్య, డిటి శ్రీనాథ్ వారి సిబ్బంది, పొందూరు గ్రామ సర్వేయర్ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, పొందూరు గ్రామ రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ రెవెన్యూ సదస్సులో పాల్గొనడం జరిగింది.

# కొండపి ఏఎంసీ కుర్చీ రేస్ లో ముళ్ల మూరి నితీష్ చౌదరి

కందుకూరు, అర్సీ ఇంచార్జ్ – శ్రీకాంత్ (శుభోదయం న్యూస్):తెలుగుదేశం పార్టీ నామినేటెడ్ పదవులు పంపిణీ చేయడానికి రంగం చేస్తున్న నేపథ్యంలో ఆశావహులు పదవుల కోసం పావులు కదుపుతున్నారు. యువకులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఈసారి కూటమి ప్రభుత్వం యువతకే నామినేటెడ్ పదవులు అందించే దిశగా ఉన్నట్లు తెలుస్తుంది. తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న పొన్నలూరు మండలంలో ఈసారి కూడా తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తికే ఏఎంసి పదవి దక్కే అవకాశం కనిపిస్తుంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఆ పార్టీకి విధేయతగా ఉన్న ముళ్ళమూరి కుటుంబానికే ఈసారి మార్కెట్ కమిటీ పదవి దక్కే అవకాశం కనిపిస్తున్నట్లు సమాచారం. యువకుడు ప్రజల్లో సు పరిచితుడుగా పేరున్న ముళ్ల మూరి సతీష్ చౌదరి కి ఏఎంసి పదవి అందిస్తే తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడానికి అవకాశం ఉంటుందని ఆయన సన్నిహిత వర్గాలు అంటున్నాయి.కొండపి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీలు రేస్ లో ఉన్నాయి. గతంలో కొండపి మార్కెట్ చైర్మన్ కు టిడిపి పార్టీ నుంచి దామచర్ల ఆంజనేయులు మినిస్టర్ గా పనిచేసిన కాలంలో పొన్నలూరు మండలం నాగిరెడ్డిపాలెం గ్రామం నకు చెందిన గుమ్మళ్ల మాలకొండయ్య రెండు పర్యాయాలు కొండపి ఏఎంసి చైర్మన్ గా పదవిని చేపట్టారు. అలాగే అదే గ్రామానికి చెందిన అనుమోలు సాంబశివరావు, పోతుల రామారావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాంగ్రెస్ గవర్నమెంట్ లో రెండు పర్యాయాలు ఏఎంసి చైర్మన్ పదవిని చేపట్టారు. కొండపి ఏఎంసి కుర్చీ కోసం ప్రస్తుతం ముళ్ళమూరి నితీష్ చౌదరి, కొండ్రగుంట శ్రీనివాసులు రేసులో ఉన్నారు. కొండ్రగుంట శ్రీనివాసులు టిడిపి ప్రభుత్వంలో పొన్నలూరు మండలం ఎంపీపీగా పనిచేశారు. మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామికి అత్యంత ఆప్తులు, సన్నిహితులు. ఒక రకంగా చెప్పాలంటే పొన్నలూరు మండలానికి షాడో ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ముళ్ల మూరి నితీష్ చౌదరి స్వగ్రామం బోగనంపాడు తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుండి ఈనాటి వరకు కుటుంబం మొత్తం పార్టీకి వీర విధేయులుగా పనిచేస్తున్నారు. నితీష్ చౌదరి తాత ముళ్ల మూరి రత్తయ్య, రెండు పర్యాయాలు బోగనంపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ గా పనిచేసి పార్టీకి,



ప్రజలకు సేవ చేసి ప్రజా బాంధవుడిగా పేరు తెచ్చుకున్నారు. మరో తాత పొన్నగంటి చినగంగయ్య తెలుగుదేశం పార్టీకి వీర విధేయుడుగా ఉండి, 10 సంవత్సరాలు పాటు సింగల్ విండో చైర్మన్ గా పనిచేసి ప్రజలతో మంచి సత్సంబంధాలు కలిగి తెలుగుదేశం పార్టీకి మంచి పేరు, ప్రతిష్టలు తెచ్చారు. ముళ్లమూరి నితీష్ చౌదరి తండ్రి ముళ్లమూరి శ్రీను బోగనంపాడు గ్రామపంచాయతీ స్థాయిలో తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం, వీర విధేయుడిగా, సైనికుడిలాగా, తెలుగుదేశం పార్టీకి ఆర్థికంగా అండదండలు అందించి, గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా, నేనున్నానంటూ భరోసా కల్పించి, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ఎటువంటి పదవులు ఆశించకుండా ప్రజల మన్ననలు పొందారు. వీరందరూ పెద్దాయన దామచర్ల ఆంజనేయులుకు వీర విధేయులు లాగా పని చేసి ఉన్నారు. అలాగే ముళ్ల మూరి నితీష్ చౌదరి గత 12 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో యాక్టివ్ రాజకీయాలు చేస్తూ, తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం, ఆర్థికంగానూ, అతనిని నమ్ముకొని తెలుగుదేశం పార్టీ వెంట నడుస్తున్న కార్యకర్తల శ్రేయస్సు కొరకు ఆర్థిక సహాయం చేస్తూ, కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ, తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం విశేష కృషి చేశారు.ప్రజల మన్ననలు పొందుతున్న యువకుడు, మంచి మనసున్న వ్యక్తి, ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీకి కుటుంబం మొత్తం వీర విధేయులు గా, సైనికులుగా పనిచేసి ఉన్నారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన కాలం నుంచి బోగనంపాడు గ్రామపంచాయతీ తెలుగుదేశం పార్టీకి కంచు కోటలాగా పనిచేసి ఉన్నారు. పెద్దాయన దామచర్ల ఆంజనేయులుకు బోగనంపాడు గ్రామం అంటే ఎంతో అభిమానం. కే అగ్రహారం, బోగనంపాడు గ్రామాల పరిధిలో ఈనాటికి ఎవరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి చేపట్టకపోవడంతో ఈ ప్రాంత వాసి మంచి యువకుడు, విద్యావేత్త, సేవా తర్పుడు ముళ్లమూరి నితీష్ చౌదరి కష్టాన్ని గుర్తించి నియోజకవర్గ స్థాయిలో ఒక యువకుడికి ఈ స్థానం కేటాయించి, యువకులను ప్రోత్సహించి, రాష్ట్రస్థాయిలో ఉన్న యువతకు, కొత్తగా రాజకీయాల వైపు చూసే యువతకు, ఆదర్శంగా నిలవాలని, నిలుస్తారని భోగనంపాడు గ్రామపంచాయతీ ప్రజలు ఆశాభవం వ్యక్తం చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ముళ్లమూరి నితీష్ చౌదరికి ఏఎంసి చైర్మన్ పదవి దక్కే అవకాశాలు మెండుగా వినిపిస్తున్నాయి. కుర్చీ ఎవరికి దక్కుతుందోనని నియోజకవర్గ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## టంగుటూరు ప్రభుత్వ హై స్కూల్ ఆవరణంలో పతంగుల ఎగురవేత కార్యక్రమం



టంగుటూరు మండల రిపోర్టర్ – వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) : టంగుటూరు ప్రభుత్వ హైస్కూల్ ఆవరణంలో విద్యార్థులచే పతంగుల ఎగురువేత కార్యక్రమం శనివారం అట్టహాసంగా జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి 1 చెంచు పున్నయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్నీ పెంపొందించడానికి ఏకాగ్రతను పెంచడానికి ఇటువంటి ఆటలు ఎంతో దోహదపడతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంబంధిత హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీమతి తులసి ప్రభ వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్రీమతి అరుణ మరియు ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులకు పలు సూచనలు ఇస్తూ పతంగుల ఎగురవేత కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

## నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా



కనిగిరి, రిపోర్టర్ జి. ప్రసాదరావు (శుభోదయం న్యూస్): నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డొక్కా మాణిక్యమ్మ మధ్యాహ్న భోజనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కె. ఎస్.ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారీయా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవకోటి మనుగడకు మొక్కలే ఆధారమని,పర్యావరణ సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. సకాలంలో వర్షాలు కురిసేందుకు చెట్లు దోహదపడతాయని, స్వచ్ఛమైన గాలి అందుతుందని అన్నారు.ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి రక్షించాలని ఎం. ఎల్.ఎ ఉగ్ర నరసింహ రెడ్డి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో డి ఎల్ డి ఓ శ్రీనివాస రెడ్డి,ఎం పి డి ఓ హనుమంతరావు,మున్సిపాలిటీ కమిషనర్ డానియేల్ జోషఫ్, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్,జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి,ఎం ఈ ఓ ల సంఘం జిల్లా అధ్యక్షులు రామిరెడ్డి,పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు,జి ఎస్ అండ్ జి డి కె ఫౌండేషన్ కోఆర్డినేటర్ నవ కుమార్,మాజీ ఎం పి పి ఎన్ వెంకటేశ్వర్లు,టి డి పి నాయకులు తమ్మినేని శ్రీనివాస రెడ్డి,ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

### ఆలయ భూముల్లో చెట్లు తొలగించిన దేవాదాయ శాఖ అధికారులు



ప్రకాశం జిల్లా బ్యూరో– చంద్ర (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని నెల్లూరు రోడ్డు నందుగల 329/2 సర్వే నంబర్ లోని శ్రీ మదన వేణుగోపాలస్వామి శ్రీవల్లి సమేత భుజంగేశ్వర స్వామిల భూమి లో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం పానకాలరావు ఆదేశాలతో జెసిబిల సహాయంతో చిల్ల చెట్లను తొలగించి శుభ్రం చేసినట్లు ఈవో గిరిరాజు నరసింహ బాబు తెలిపారు. ఆ ఈ కార్యక్రమంలో ఈవో గిరిరాజు నరసింహబాబు, కొండిశెట్టి రమణయ్య, బండ్ల నారాయణ, ఉమ్మడిశెట్టి శ్రీను, విజయ్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.



## ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు



కనిగిరి, రిపోర్టర్ జి. ప్రసాద్ రావు, (శుభోదయం న్యూస్): అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో కనిగిరి నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి గూడూరు సురేష్ ఎ ఐ వై ఎఫ్ నాయకులు సుబ్బారావు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కనిగిరి పట్టణంలో ఆటలు పోటీలు మరియు కనిగిరి నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కబడ్డీ పోటీలకు మొదటి బహుమతి 10.000/- లు రెండవ బహుమతి 5000/–లు ఇవ్వడం జరుగుతుందన్నారు కబడి పోటీల్లో పాల్గొన్నవారు 10వ తేదీ సాయంత్రం ఐదు గంటలకి టీం పేర్లను 300/- ఎంట్రీ ఫీజు చెల్లించి నమోదు చేసుకోగలరని కోరడమైనది. కబడ్డీ పోటీలు 11వ తేదీ నుండి ప్రభుత్వ గవర్నమెంట్ హై స్కూల్ కనిగిరి నందు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమములో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ పవన్ కళ్యాణ్ మండల కన్వీనర్ ఇఫ్రాజ్ ఏఐవైఎఫ్ నాయకులు నజీముద్దీన్ పాల్గొన్నారు.

## నెల్లూరు నగర కమిషనర్ సూర్యతేజను

### మర్యాద పూర్వకంగా కలిసిన కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి పూజ



కందుకూరు, అర్సీ ఇంచార్జ్ – శ్రీకాంత్ (శుభోదయం న్యూస్):కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి పూజ ఐ.ఏ.ఎస్.,, నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ ఐ.ఏ.ఎస్., ను శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ నందు మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## వీక్షణం సంపాదకుడు వేణుగోపాల్ పై ఆర్ ఎస్ ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించండి : సిపిఐ నేత పి.మాలకొండయ్య



కందుకూరు, అర్సీ ఇంచార్జ్ – శ్రీకాంత్ (శుభోదయం న్యూస్):'వీక్షణం' సంపాదకుడు, మేధావి ఎన్. వేణుగోపాల్ మీద ఆర్ఎస్ఎస్ మతోన్మాద మూకలు సోషల్ మీడియా వేదికగా చేస్తున్న విష ప్రచారాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నెల్లూరు జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ పి.మాలకొండయ్య ఖండించారు. తమకు నచ్చని పుస్తకాన్ని అమ్ముతున్నారనే పేరుతో కొంతమంది మతోన్మాద శక్తులు వేణుగోపాల్ పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ చర్యలు భావ ప్రకటనా స్వేచ్ఛ మీద, పరిశోధనల మీద దాడి అని అభివర్ణించారు. ఆ పుస్తకాలలో చెప్పిన విషయాలపై అభ్యంతరాలు ఉన్నవారు వాటిని ఖండిస్తూ మరో పుస్తకం రాయవచ్చని సూచించారు. అంతేతప్ప ఒక మతానికి చెందిన వారిని రెచ్చగొట్టి దాడులకు ప్రోత్సహించడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఇలాంటి చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వీటిని ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, వేణుగోపాల్ కు అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేస్తారు

## ముక్కోటి ఏకాదశి పోస్టర్ ఆవిష్కరించిన కావలి ఎమ్మెల్యే



కావలి:(శుభోదయం న్యూస్) :కావలి పట్టణం బృందావనం కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలకు సంబంధించిన పోస్టర్ ను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆవిష్కరించారు.. శనివారం బృందావనం కాలనీలోని వెంకటేశ్వరస్వామిదేవస్థానంలో జరిగినకార్యక్రమంలో శ్రీరాంమాల్యాద్రిఆధ్వర్యంలోని ఆలయకమిటీసభ్యులతోకలసి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ జనవరి 10వ తేదీ శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినమని, ఇదిచాలా శుభకరమైనరోజని, విష్ణుమూర్తికి ప్రీతికరమైనరోజని తెలిపారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం రోజునఉపవాసంచేస్తూ, ఉత్తర ద్వారంద్వారాస్వామివారిని దర్శనంచేసుకోవడం జరుగుతుందనితెలిపారు. బృందావనంకాలనీలోని వెంకటేశ్వరస్వామిదేవస్థానానికి పెద్దఎత్తునభక్తులు విచ్చేస్తుంటారని, కార్యక్రమాలు కూడావిశేషంగాదేవస్థానంవారు చేయడంజరుగుతుందని తెలిపారు. ముక్కోటి రోజున స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఎమ్మెల్యే కోరారు.

## ఎక్సైజ్ అధికారుల విస్తృత తనిఖీలు



బిట్రగుంట(శుభోదయం న్యూస్) :: నెల్లూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాబోవు పండుగ దినాలను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి నాటుసారా తయారీ, విక్రయాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో భాగంగా శనివారం కావలిఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ శ్రీనివాసులు ఆధ్వర్యంలోని ఎక్సైజ్ బలగాలుముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. బోగోలు మండలంలోని కడనూతల, కప్పరాళ్ళతిప్ప, బోగోలుగంగతిప్ప, చెంచులక్ష్మీపురం, నాగులవరం, సోమేశ్వరపురం గ్రామాలలోని అటవీ ప్రాంతాలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పై తనిఖీలలోనెల్లూరుఎన్ఫోర్స్మెంట్ వింగ్, కోవూరు, కావలిఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన స్కూల్ కమిటీ చైర్మన్ పందింటి మోహన్



కనిగిరి, రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్): కనిగిరి మోడల్ స్కూల్ నందు ఉన్న సమస్యలను ప్రకాశం జిల్లా కలెక్టర్ తమమ్మ్ అన్సరియాకి శుక్రవారం కనిగిరిలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రభుత్వ కనిగిరి జూనియర్ కళాశాలలో ప్రారంభించడానికి విచ్చేసిన సందర్భంగా ఎస్ఎంసి కనిగిరి మోడల్ స్కూల్ ఎస్ఎంసి కమిటీ చైర్మన్ పందిటి మోహన్ సమస్యలను ఆర్జీ రూపంలో విన్నవించారు మోడల్ స్కూల్లో చుట్టూరు ప్రహరీ,నీటి సమస్యతో బాత్రూములకు మహిళా ఉపాధ్యాయునిలకు ఉపాధ్యాయులకు, విద్యార్థిని, విద్యార్థులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమస్యను లేకుండా చూడలని, హాస్టల్ విద్యార్థుల కొరకు అడ్మిషన్లు పెంచాలని, రోడ్డు నిర్మాణం త్వ రితగతిన పూర్తిచేయాలని, మోడల్ స్కూల్ కి ఉత్తరం పక్క ఉన్న తిప్పను తొలగించాలని, ఆట స్థలము కేటాయించాలని ఆమె దృష్టికి తీసుకెళ్లారు.అంతకుముందు జరిగిన కార్యక్రమంలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి గారు గార్ల పేట రోడ్డు నుండి మోడల్ స్కూల్ వరకు సిమెంట్ రోడ్డు మంజూరు చేయించినట్లు తెలిపారు వారికి ఈ క్రమంలో మోడల్ స్కూల్ ఎస్ఎంసి కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకమును ప్రారంభించిన భీమా నాయక్



ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకమును ప్రారంభించిన పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం భీమా నాయక్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చదువు కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని ఆయన అన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థుల ఆరోగ్యం, విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకొని కోట్ల రూపాయల నిధులు కేటాయించడం హర్షనీయం అని ఆయన



అన్నారు. ఇంతటి గొప్ప పథకాన్ని గతంలో పదవ తరగతి వరకు ఉండేదని నేటి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించడం పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క విద్యార్థి సద్వినియోగపరచుకోవాలని చూపించారు. విద్యార్థులు ఇంటర్మీడియట్ దశలో లెక్చరర్ల సూచనలు, సలహాలు సక్రమంగా పాటిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకుంటారని తెలిపారు. ఇంటర్మీడియట్ దశ విద్యార్థుల జీవితాలకు దిశా నిర్దేశనం నిర్ణయించే సమయం అని మంచి ఆలోచనలతో ఉన్నత స్థానమే లక్ష్యంగా చేసుకుని విద్యనభ్యసించాలని అన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ కరుణ కుమారి మాట్లాడుతూ గొప్ప మానవత్వం ఉన్న మాతృమూర్తి డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించడం సంతోషించదగ్గ పరిణామమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పామూరు సబ్ ఇన్స్పెక్టర్ టి కిషోర్ బాబు, కళాశాల ప్రిన్సిపల్, ప్రధానోపాధ్యాయులు రామస్వామి, గుత్తి రమణయ్య, పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## డొక్కాసీతమ్మ మధ్యాహ్నబడి భోజనంఇంటర్ విద్యార్థులకు వరం

## జూనియర్ కళాశాలలో మధ్యాహ్నభోజనం ప్రారంభించిన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి



బిట్రగుంట, (శుభోదయం న్యూస్) : విద్యార్థులు తమ లోపాలను సరిదిద్దుకొని కష్టాన్ని ఇష్టంగా మార్చుకుంటే జీవితం సుఖమయం అవుతుందని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన కావలి నియోజకవర్గం లోని దగదర్తి, బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. స్వయంగా విద్యార్థులకు వడ్డించిన అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కాలేజీలకు విచ్చేసిన ఎమ్మెల్యే కు విద్యార్థులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. బిట్రగుంట జూనియర్ కాలేజీలో సరస్వతి దేవి విగ్రహం వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కాలేజీల అకడమిక్ ప్రగతి నివేదికను ప్రిన్సిపాల్స్ వివరించారు. మత్తు పదార్థాల వలన కలిగే హాని ని విద్యార్థులు ఈ సందర్భంగా తెలియజేసారు. ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందించడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు లేనివిధంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నబడి భోజనం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆకలి తీర్చిన అన్నపూర్ణమ్మ మహాతల్లి డొక్కా సీతమ్మ పేరు ఈ పథకానికి పెట్టడం, ఈ పథకానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనం అని తెలిపారు. ఇది ప్రభుత్వ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఎంతో ఉపయోగమన్నారు. కాలేజీలో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని, ఇది ఇంటర్ విద్యార్థులకు ఒక



వరమని అన్నారు. మాది ప్రజల ప్రభుత్వమని, మంచి చేసే ప్రభుత్వమని, విద్యా వికాసం కోసం చర్యలు తీసుకునే ప్రభుత్వమని తెలిపారు. విద్యార్థుల ఆకలి తీర్చడం ఒక్కటే లక్ష్యం కాదని, రుచికరమైన, ఆరోగ్యకరమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం తమ ప్రభుత్వ బాధ్యతని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 లక్షల మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. పేదవాడు ఉన్నత స్థాయికి ఎదగాలని, పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని, శారీరక దృఢత్వం, మానసిక పరిపక్వత చెందాలని యువనేత, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఈ పథకం రావడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాల వైపు వెళ్ళొద్దని, క్షణికానందం కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అని తెలిపారు. మరో 5 సంవత్సరాలు కష్టపడి చదివితే, జీవితాంతం ఆనందంగా ఉండవచ్చు అని తెలిపారు. ఈ సమయంలో కష్టపడితే జీవితం ఆనందమయం అవుతుందని, అదే ఇప్పుడు మనం సంతోషాల కోసం సమయం వృధా చేస్తే జీవితం కష్టాల పాలవుతుందని తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో కావలి గంజాయికి కేంద్రంగా ఉండేదని, ఇప్పుడు గంజాయి రహిత కావలిగా మార్పు చెందిందని, గంజాయి విక్రేతలు 40 మందికి పైగా అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. కావలి నియోజకవర్గంలో గంజాయిని కూకటి వేళ్ళతో సైతం పేకలిస్తామని తెలిపారు. దగదర్తి జూనియర్ కాలేజీకి అవసరమైన ప్రహరీగోడ, క్రీడా మైదానం చదును, ఇతర సమస్యలను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో బిట్రగుంట జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, దగదర్తి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సిహెచ్. ప్రకాష్ రావు, బోగోలు ఎంఈవో జయమ్మ, దగదర్తి ఎంఈవోలు భాస్కర్, విజయ రత్నం, టీడీపీ బోగోలు మండల అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, దగదర్తి మండల టీడీపీ అధ్యక్షులు అల్లం హనుమంతరావు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సిఐ భీమా నాయక్, ఎస్ఐ కిషోర్ బాబులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఆకుపాటి




ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్): పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం భీమా నాయక్, సబ్ ఇన్స్పెక్టర్ టి కిషోర్ బాబు లను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన టిడిపి యువ నాయకులు, ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు, డాక్టర్ ఆకుపాటి వెంకటేష్ మరియు




మిత్రులు. ఈ కార్యక్రమంలో నీరు కట్టు నాయబ్ రసూల్, పుప్పాల రామ్మూర్తి, చాంద్బాషా పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## దామచర్ల పూర్ణచంద్రరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన - ఎం నిడమనూరు టిడిపి నాయకులు



టంగుటూరు మండల రిపోర్టర్ - వెంకటేశ్వర్లు టీ (శుభోదయం న్యూస్) : ప్రముఖ వ్యాపారవేత్త టిడిపి సీనియర్ నాయకులు రాష్ట్ర మారి టైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య తండ్రి గారైన దామచర్ల పూర్ణచంద్రరావు జన్మదినోత్సవం సందర్భంగా ఎం నిడమనూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు పూర్ణచంద్రరావుని శనివారం ఒంగోలులోని ఆయన స్వగృహంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం నిడమనూరు గ్రామానికి చెందిన కాకుమాని శ్రీకాంత్ టంగుటూరు మండల టిడిపి అధ్యక్షులు కాకుమాని శ్రీనివాస్ టిడిపి సీనియర్ నాయకులు కొత్తపల్లి వెంకయ్య టిడిపి పొందూరు గ్రామ ప్రధాన కార్యదర్శి పేరా బత్తిన రంగారావు సభ్యులు కల్లగుంట బాల తదితరులు పూర్ణచంద్రరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు.

## మధ్యాహ్న భోజనం.. పేద విద్యార్థులకు వరం



రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : మండల పరిధిలోని జెట్టిపాలెంలో గల ఏపీ మోడల్ స్కూల్లో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టి 55 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించారు. గతంలో 2019 సంవత్సరం కంటే ముందు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మధ్యాహ్నం భోజన పథకం పాఠశాలలతో పాటు ఇంటర్ ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు అందించింది. 2019 ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుకు మంగళం పాడింది. దీంతో ఆయా కళాశాలలో చదివే పేద విద్యార్థులు ఆకలికి అలమటించారు. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకం అమలుకు శ్రీకారం చుట్టడంతో కళాశాలల్లో శనివారం పథకం పునః ప్రారంభించినట్లయింది. స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో చదివే విద్యార్థులంతా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పరిసర గ్రామాలకు చెందిన గ్రామీణ విద్యార్థులు. వీరంతా ఇంట్లో చద్దన్నం తిని, ఆగమేఘాల మీద ఉదయం 9 గంటలకే కళాశాలకు చేరుకొంటున్నారు. సమయానికి వంట కాకపోతే వారు మధ్యాహ్న భోజనం చేయడానికి టిఫిన్ బాక్సులు తెచ్చుకోలేని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రభుత్వం తీసుకురావడంతో విద్యార్థుల కష్టాలు తొలగి, హాజరు శాతం పెరిగే అవకాశం ఉంది. ఆకలి బాధ లేకపోవడంతో విద్యార్థులు చదువుపై దృష్టి సారించి వార్షిక పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత శాతం పెరిగే అవకాశం ఉంటుందని అధ్యాపకులు తెలుపుతున్నారు. పథకం మెనూలో భాగంగా శనివారం విద్యార్థులకు రుచికరమైన వంటకాలు ఆకుకూర అన్నం, పప్పు చారు, పొంగలి, రాగి జావ అందించారు.

## కేశినేనిని మర్యాదపూర్వకంగా కలిసిన మోపాడు రిజర్వాయర్ సూపర్ చైర్మన్ చుంచు



ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్): విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం మోపాడు రిజర్వాయర్ సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించిన కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర, ప్రకాశం జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారియా





కనిగిరి, రిపోర్టర్ జి. ప్రసాద్ రావు, (శుభోదయం న్యూస్): కనిగిరి జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డొక్క మాణిక్యమ్మ మధ్యాహ్నం భోజన పథకాన్ని కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజానికి విద్యార్థి దశే కీలకం. ఈ ప్రాధాన్యతను గుర్తించి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనం అందించి, పోషకాహారం అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అద్భుతమైన కార్యక్రమం. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గారి చొరవతో రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో ప్రారంభించడమైనది. ఈ పథకం కడుపు నింపే ప్రయత్నం మాత్రమే కాదు. విద్యార్థులందరికీ పోషకాహారం అందించి, వాళ్ల ఆరోగ్యాన్ని పరిరక్షించడం. ఆరోగ్యంగా ఉంటే మంచి ఆలోచనలు వస్తాయి. ఆరోగ్యకరమైన సమాజం నిర్మిస్తాయి. పిల్లలు ఆరోగ్యకరంగా ఉంటే చదువులో మంచి ప్రగతి చూపించగలరు. తమ జీవితాన్ని తాము మలచుకోగలరు. భవిష్యత్తును తీర్చిదిద్దుకోగలరు. తల్లిదండ్రులు, గురువులు, దేశం గర్వించదగిన పౌరులు కాగలరు. ఇది బాధ్యత గల ప్రభుత్వం. ప్రజా సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వమని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి అన్నారు ఈ కార్యకమంలో జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు కూటమి నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కులగణనను సక్రమంగా చేయండి వినతి పత్రం అందజేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



యాడికి జనవరి 4 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ (శుభోదయం న్యూస్) : మండలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టినటువంటి కులగణన సచివాలయంలో ఎస్సీ జాబితాను గ్రామాల పరిశీలన చేయడం జరిగింది. కొన్ని గ్రామాల్లో కొంతమంది పేర్లను మాదిగ క్రిస్టియన్ గా మరియు మాదిగలను మాలలుగా చూపించడం జరిగినది. సచివాలయ పరిధిలో ఉన్న సచివాలయ అధికారులు ఇంతవరకు కులగణన విషయం మాదిగలకు తెలియజేయకుండా నోటీస్ లో లిస్టు అంటించకుండా నిర్లక్ష్యంగా



వ్యవహరిస్తున్నటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా జాబితా నందు తప్పు, ఒప్పులను సరి చేసుకునేందుకు ఈనెల 7 తారీఖు తో పూర్తవుతుంది. కనుక పల్లెలో ప్రతి మాదిగ ఇంటికి సచివాలయ సిబ్బంది వెళ్లి ఎస్సీ కులగణన జాబితాను వివరించి తప్పులను సరి చేసే విధంగా ఆదేశాలు జారీ చేసి, మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల ఏబిసిడి వర్గీకరణ పోరాటానికి సహకరిస్తారని తమరిని ప్రార్థిస్తూ కోరుచున్నాము అని ఫిర్యాదు చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పుల్లయ్య మాదిగ తాడిపత్రి నియోజకవర్గం కో ఇంచార్జ్ యాడికి మండలం అధ్యక్షులు జి నరసింహులు మాదిగ, రంగస్వామి మాదిగ, నగరూరు వెంకటేష్ మాదిగ,ఎల్. ఓబులన్న మాదిగ,ఎల్. పెద్దిరాజు మాదిగ పాల్గొనడం జరిగింది.

## కాకర్ల సురేష్ కు నూతన సంవత్సం శుభాకాంక్షలు తెలిపిన అరవా





ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్): ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి టిడిపి యువ నాయకులు టిఎన్ఎస్ఎఫ్ డిస్టిక్ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ అరవ కార్తీక్ నరసింహ. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# విద్యా వినయేన శోభతే" అన్న సూక్తిని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలి : ప్రత్తిపాటి



చిలకలూరిపేట, పాలపర్తి శ్రీనివాసరావు(శుభోదయం న్యూస్) : విద్యార్థులే రాష్ట్ర భవిష్యత్ అని, దేశానికి పట్టుకొమ్మల్లాంటి వారని, రోజురోజుకీ కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వారు అందిపుచ్చుకోవాలనే సత్సంకల్పంతోనే మంత్రి లోకేశ్ ఈ దిశగా ఆలోచన చేశారాని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక శారదా జడ్పీ హైస్కూల్ లో ని జూనియర్ కళాశాలతో పాటు, యడ్లపాడులోని మహిళా జూనియర్ కళాశాలలో, ఇంటర్ విద్యార్థులకోసం కూటమిప్రభుత్వం తీసుకొచ్చిన డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్నిలాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేయడం ద్వారా యువనాయకులు, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ చరిత్ర సృష్టించారన్నారు. మంచి భోజనం ఉంటేనే విద్యార్థులు మంచిగా చదువుకుంటారని, వారి ఆలోచనలు, ఎదుగుదలకు ఆకలి అడ్డంకి కారాదని భావించే లోకేశ్ ఇంత గొప్ప నిర్ణయం తీసుకున్నారని మాజీ మంత్రి పుల్లారావు కొనియాడారు. మధ్యాహ్న భోజనం పథకానికి ఎంతోమంది ఆకలి తీర్చిన డొక్కా సీతమ్మ పేరు పెట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించడం, దాన్ని వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేయడం జరిగిందన్నారు. ఈ విద్యాసంవత్సరంలో మిగిలిన కాలంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అందించడానికి రూ.27.39కోట్ల వరకు ఖర్చవుతుందని, వచ్చే విద్యాసంవత్సరం పూర్తిస్థాయిలో అమలుచేయడానికి రూ.85.84కోట్ల వరకు ఖర్చు అవుతుందని మాజీ మంత్రి చెప్పారు. నాణ్యమైన విద్యతో పాటు, రుచీ..శుచీ కలిగిన మంచి భోజనం ఉన్నప్పుడే ఇంటర్ విద్యార్థులు మరింత మెరుగ్గా ఉన్నత విద్యలో రాణిస్తారని పుల్లారావు అభిప్రాయపడ్డారు. విద్యార్థులే రాష్ట్ర భవిష్యత్ అని, వారు దేశానికి పట్టుకొమ్మల్లాంటి వారని, రోజురోజుకీ కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వారు అందిపుచ్చుకోవాలనే సత్సంకల్పంతోనే మంత్రి లోకేశ్ ఈ దిశగా ఆలోచన చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సాంకేతిక పరిజ్ఞానాన్ని, మేథస్సును గుర్తించడంలో ముందుంటారని, రాష్ట్ర విద్యార్థులను ప్రపంచం మెచ్చేలా తీర్చిదిద్దాలన్నదే ఆయన ఆలోచన అని పుల్లారావు చెప్పారు. శారదా జడ్పీ హైస్కూల్, జూనియర్ కళాశాల పల్నాడు జిల్లాలోనే అత్యధిక విద్యార్థులున్న విద్యాసంస్థ అని, అలాంటి సంస్థలకు ఎప్పుడు, ఎలాంటి సౌకర్యాలు కావాలన్న ఏర్పాటు చేయడానికి తాను సిద్ధంగా ఉంటానని మాజీ మంత్రి చెప్పారు. గతంలో ప్రభుత్వ జీవోలు (గవర్నమెంట్ ఆర్డర్స్) అన్నీ ఆంగ్లంలోనే ఉండేవని, ఇకపై కూటమి ప్రభుత్వం వాటిని తెలుగులో విడుదల చేయబోతోందని, చంద్రబాబు ప్రభుత్వం తెలుగుభాషకు, తెలుగుజాతికి ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ అని మాజీమంత్రి తెలిపారు. తెలుగుభాషపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని, అన్యభాషలపై కూడా తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. గత పాలకుల అరాచక పాలన నుంచి విముక్తులమై, తాము ఇప్పుడు చాలా సంతోషంగా, స్వేచ్ఛగా ఉన్నామని ప్రజలే చెబుతున్నారని, వారి ఆదరణ, అభిమానాలే కూటమిప్రభుత్వ పనితీరుకు, విజయానికి నిదర్శనమని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో శారదా జడ్పీ హైస్కూల్, జూనియర్ కళాశాల మరియు యడ్లపాడు మహిళా జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులతో పాటు కూటమినేతలు తోట రాజా రమేష్, షేక్ కరిమూలా, కామినేని సాయి బాబు, సుబాని, పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, పోపురి రామారావు, తోకలా రాజేష్, ఎంఈఓ లక్ష్మి తదితులున్నారు.

## మహిళా ఆరోగ్య సంరక్షణ అంశంపై అవగాహన సదస్సు



మాచర్ల నియోజకవర్గ ఇన్చార్జ్ - వేల్పుల చిన్న గురవయ్య, (శుభోదయం న్యూస్): శనివారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల యందు సీనియర్ మహిళా వైద్యురాలు డాక్టర్ విజయ కుమారి మరియు శ్రీమతి మారేపల్లి భవ్యశ్రీ చే మహిళల ఆరోగ్య సంరక్షణ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లలకు వయసుతోపాటు ఏర్పడే అనేక సమస్యల పట్ల అవగాహన కలిగి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే తల్లితో మరియు ఉపాధ్యాయునితో చర్చించి ముందస్తుగానే సమస్యలు లేకుండా చేసుకోవాలని డాక్టర్ మారేపల్లి భవ్యశ్రీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కొండవీటి కృష్ణకుమారి సెక్రెటరీ నిమ్మగడ్డ సురేఖ, అన్నపురెడ్డిలక్ష్మి, రాధా, డాక్టర్ కొండవీటి రామకోటయ్య, నాగూర్ వలి, కెసిపి వాసు, మస్తాన్ వలి సాంబశివరావు, ఆలేటి కోటేశ్వరరావు, సత్య ప్రసాద్, బంగారు మాణిక్యాల బాబు, ప్రోగ్రాం కన్వీనర్ మారేపల్లి లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సకినా బేగం, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## లే అవుట్ల ఏర్పాటు, ప్లాట్ల అమ్మకాలకు సంబంధించి కఠిన నిబంధనలు అమల్లోకి రానున్నాయి - ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట, పాలపర్తి శ్రీనివాసరావు(శుభోదయం న్యూస్) : పట్టణంతో పాటు నియోజకవర్గంలో ఎక్కడా అనధికార లే అవుట్లు ఉండటానికి వీల్లేదని, ప్రభుత్వ అనుమతులు లేకుండా ధనార్జనే ధ్యేయంగా తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థలు లేకుండా వేసిన లే అవుట్లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని, నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వంలో జరిగిన భూ ఆక్రమణలు, కబ్జాలపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపబోతోందని మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శనివారం పట్టణంలోని శారదా జడ్.పీ.పీ.హైస్కూల్ లో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన ప్రాంతీయ రెవెన్యూ సదస్సులో తాను పాల్గొన్నానని, చిలకలూరిపేట నియోజకవర్గ వ్యాప్తంగా గతప్రభుత్వంలో జరిగిన భూ ఆక్రమణలు, కబ్జాలతో పాటు చెరువులు.. కుంటలు.. కాలువలు సహా చుక్కల మరియు నిషేధిత భూములతో పాటు కొందరు భూములను ఆక్రమించారని, సదరు ఆక్రమణలపై వెంటనే విచారణ జరిపి, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్టు పుల్లారావు చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారం వేసిన లే అవుట్లను కట్టడిచేసేలా ప్రభుత్వం త్వరలోనే జీవో తీసుకురానుందని, అలాంటి స్థలాలు, ప్లాట్లు రిజిస్ట్రేషన్ జరగకుండా కఠినచర్యలకు సిద్ధమవుతోందని పుల్లారావు తెలిపారు. చిలకలూరిపేట పట్టణంతో పాటు నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో పుట్టగొడుగుల్లా అనధికార లే అవుట్లు వెలిశాయని, ప్రజల బలహీనతను సొమ్ము చేసుకోవడానికి భూ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్నారు. ఐదేళ్ల పాటు లే అవుట్లకు అనుమతులు లేకుండా, నివాసభూములుగా మార్చి నిబంధనల ప్రకారం ప్రభుత్వ అనుమతులు పొందకుండా ఇష్టానుసారం వ్యవహరించారని మాజీ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. లే అవుట్లలో కనీస వసతులైన రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్యుత్, పచ్చదనం వంటి వాటి ఏర్పాటు గురించి ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కొన్నిచోట్ల కాలువలు, డొంకలు, రోడ్లు, కుంటలు కూడా ఆక్రమించి లే అవుట్లు వేశారన్నారు. ఈ వ్యవహారాలన్నింటినీ నిన్న జరిగిన సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకెళ్లానని, ప్రజలకు అన్యాయం, నష్టం చేసినవారు ఎంతటివారైనా వదిలేది లేదని పుల్లారావు తేల్చిచెప్పారు. లే అవుట్లు వేసే వారు, ప్రభుత్వనిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, న్యాయంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఎంతో ఆశతో ఇళ్లు కట్టుకోవాలనుకునే వారిని, సొంతింటి కల సాకారం చేసుకోవాలనుకునే పేద, మధ్యతరగతి వర్గాల వారిని మోసం చేయడం క్షమించరాని నేరమన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ తరహా రియల్ వ్యాపారంపై కఠిన చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని స్వయంగా మంత్రి అనగానిని కోరినట్టు పుల్లారావు చెప్పారు. భవిష్యత్ లో ఇటువంటి వాటికి అవకాశం లేకుండా కూటమి ప్రభుత్వం లే అవుట్ల ఏర్పాటు, అమ్మకాలకు సంబంధించి కఠినమైన చట్టాలు అమలు చేయనుందని మాజీ మంత్రి స్పష్టం చేశారు.

## బీజేపీ బలోపేతమే లక్ష్యం కావాలి



రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వాన్ని అధిక స్థాయిలో పెంచుతూ పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రతి కార్యకర్త లక్ష్యంగా పనిచేయాలని మాచర్ల నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పోకూరి కాశీపతి అన్నారు. శనివారం రెంటచింతల మండలానికి బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన బోయ నాగిరెడ్డి అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోయి సభ్యత్వ నమోదును పెంచిన కార్యకర్తలకు పార్టీ గుర్తింపు ఇస్తుందటానికి నాగిరెడ్డి నియామకం ఉదాహరణ అన్నారు. బిజెపి ఒక సిద్ధాంతాలతో పనిచేసే పార్టీ అని, ఏపీలో కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. తన నియమకానికి సహకరించిన పార్టీ పెద్దలందరికీ నాగిరెడ్డి కృతజ్ఞతలు తెలుపుతూ అందరి సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల సంస్థాగత ఎన్నికల అధికారి బొగ్గవరపు మస్తాన్ రావు, సీనియర్ నేత పాశం మట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీ నాయన...



విజయనగరం,జిల్లా ప్రతినిధి, బొద్దాన.శ్రీనివాస్...(శుభోదయం న్యూస్):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈరోజు నుంచి అన్ని కాలేజీల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించింది..



బొబ్బిలి నియోజకవర్గం, బాడంగి మండలంలో ఉన్న ప్రభుత్వ కళాశాలలో ఈ పథకాన్ని ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు(బేబీ నాయన) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయన విద్యార్థులకు స్వయంగా వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బాడంగి మండలం టీడీపీ అధ్యక్షులు శ్రీ తెంటు రవిబాబు గారు, వైస్-ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు , మాజీ ఎంపీపీ బొంతు త్రినాథ నాయుడు , బాడంగి మండలం టీడీపీ జనరల్ సెక్రటరీ ఎల్.సత్యం , పారాది ఆయకట్టు చైర్మన్ పెంట సత్యనారాయణ , టీడీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంఈఓ, కాలేజీ ప్రిన్సిపాల్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..!!

## వీఆర్వో అడపా గౌరీ శంకర్రావు తక్షణమే అరెస్ట్ చేయాలి....
## దళిత సంఘాలు. సిపిఐ పార్టీ డిమాండ్



విజయనగరం,జిల్లా ప్రతినిధి, బొద్దాన.శ్రీనివాస్...(శుభోదయం న్యూస్): పారాది గ్రామానికి చెందిన దళిత మహిళ నగర పోలమ్మ తమ భూమి పాస్ పుస్తకాల కోసం కొంతకాలంగా రెవిన్యూ అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేయడం జరిగింది . అదే పని మీద డిసెంబర్ 30వ తేదీన బొబ్బిలి తాసిల్దార్ కార్యాలయానికి వెళ్ళగా అక్కడే ఉన్నటువంటి విఆర్ఓ అడపా గౌరీ శంకర్రావు పాస్ పుస్తకం కోసం వెళుతున్న నగర పోలమ్మను దగ్గరకు పిలిచి నీకు ఎన్ని సార్లు చెప్పాలే. మీ భూమికి పాస్ పుస్తకం ఇవ్వడం కుదరదని. నీ దిక్కున చోట కంప్లైంట్ చేసుకో ఈ భూమికి పాస్ పుస్తకం ఎలా వస్తదో నేను చూస్తాను లాయే అంటూ అసభ్యకర పదజాలంతో దూషించడాన్ని దళిత సంఘాలు సిపిఐ పార్టీగా తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. శనివారం కులం పేరుతో దళిత మహిళను దూషించిన విఆర్వో అడపా గౌరీ శంకర్ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బొబ్బిలి పట్టణంలో స్టేట్ బ్యాంకు వద్ద ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సురగాల లక్ష్మణరావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టి అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని. అట్రాసిటీ ఎఫైర్ అవ్వగానే నిందితున్ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దళిత మహిళను కులం పేరుతో దూషించడమే కాక అసభ్యకర పదజాలంతో ఒళ్ళు కొవ్వెక్కి విర్రవీగుతున్న విఆర్వో అడపా గౌరీ శంకర్ పై బొబ్బిలి పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వగానే అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీస్ యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. సమగ్ర విచారణ జరిపి విఆర్ఓ పై కఠిన చర్యలు తీసుకొని ఉద్యోగం నుండి సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులను కోరారు . అలాగే అడపా గౌరీ శంకర్రావు అక్రమ ఆస్తులపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఈ సందర్భంగాతెలిపారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న. దళిత హక్కుల పోరాట సమితి నాయకులు గర్భాపు రమేష్. ఎమ్మార్పీఎస్ నాయకులు పిల్లి శంకర్రావు. కన్నారావు ఆర్ హరిబాబు ఈ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర ప్రజలను మద్యానికి
## బానిసలను చెయ్యడమేనా ప్రభుత్వ ఉద్దేశ్యం-లోక్ సత్తా!



విజయనగరం,జిల్లా ప్రతినిధి, బొద్దాన. శ్రీనివాస్...(శుభోదయం న్యూస్): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలు పెరిగి అలాగే విద్యుత్ చార్జీల భారం పడి సామాన్య ప్రజల ఈ ధరల భారంతో సతమతమవుతుంటే వీటిని సరిదిద్ద వలసిన ప్రభుత్వం రాష్ట్రంలో మద్యం ధరలను తగ్గించి నూతన సంవత్సరం సందర్భంగా అమ్మకం గంటలు అదనంగా పెంచి ప్రజలను పండగ పూట పూటుగా తాగి మీ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకోండి అని చెప్పినట్టే కదా. అంటే రాష్ట్ర ప్రజలను మద్యానికి బానిసలుగా చేసి ప్రశ్నించకుండా చెయ్యడమే ఈ ప్రభుత్వ ఉద్దేశ్యంగా కనిపిస్తుంది అని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు అన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం ధరలు తగ్గించి తాగడానికి అందరికీ అందుబాటు ధరలలో ఇస్తాం అన్నారు. వారు ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు చెయ్యక పోయినా ఈ మద్యం ధరలు తగ్గించి అందరికీ అందుబాటులోకి తెచ్చి ఎక్కడ పడితే అక్కడ విచ్చల విడిగా మద్యం దొరికేటట్టు చేసారు. ఇది చాలదన్నట్టు నూతన సంవత్సరం అని మద్యం వ్యాపారులకు సమయాన్ని పెంచి మద్యం అమ్ముకోండి అని ఉత్తర్వులు ఇచ్చారు. డిసెంబర్ 31వ తేదీ ఒక్క రోజు మద్యం విక్రయాలు చూస్తే మనం ఆశ్చర్యపడవలసిందే. ఆ వివరాలు.... డిసెంబరు 31వ తేదీ ఒక్క రోజే మన మందు బాబులు రాష్ట్రంలో దాదాపు 200 కోట్ల రూపాయల విలువైన మద్యాన్ని సునాయాసంగా తాగేసారు. అందులో 60 లక్షల క్వార్టర్ మద్యం సీసాలు, 180 లక్షల బీరు సీసాలు ఖాళీ చేసేసారు. ఇక మన ఉమ్మడి విజయనగరం జిల్లా విషయానికి వస్తే 9 కోట్ల విలువైన మద్యం తాగేసారు. విజయనగరం జిల్లాలో 153 దుకాణాలు, 26 బార్ల ద్వారా 7.21 కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 దుకాణాలు, 8 బార్ల ద్వారా 2.16 కోట్లు అమ్మకాలు జరిగాయి. నూతన సంవత్సరం సందర్భంగా నిర్ణీత సమయం కంటే అదనంగా రెండు గంటలు విక్రయానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. మొత్తంగా 14 గంటల పాటు మద్యం అమ్మకాలు జరిగాయి. గంటకు 14.28 కోట్ల విలువైన మద్యం అమ్మారు. సాధారణంగా రోజుకు 80 కోట్ల విలువైన మద్యాన్ని డిపోల నుండి దుకాణాలకు తరలిస్తారు, నూతన సంవత్సరం సందర్భంగా రెండు రెట్లు అధికంగా మద్యం తరలించారు. ఎంత లాభ సాటి వ్యాపారమో కదా. అసలు ప్రభుత్వ ఉద్దేశ్యం ఏమిటో విజ్ఞులయిన ప్రజలను ఆలోచించమని నా మనవి అని దామోదర రావు అన్నారు.

## రచనలతో రంకెలుయ్యి
## గౌరవ సలహాదారులు రామోద్రి గోవిందరావు....



విజయనగరం,జిల్లా ప్రతినిధి, బొద్దాన.శ్రీనివాస్...(శుభోదయం న్యూస్):ప్రతీ మనిషికి ఒక కళ ఉంటుంది.రచయత (కవి) దేనినైనా అందంగా లేదా అసహ్యంగా వర్ణించగలడు.తప్పును ఒప్పుగా ,ఒప్పును తప్పుగా మలిచే మహామేధావి.అది సరస్వతీ ఇచ్చే జ్ఞానం.ఎన్ని అవార్డులు వచ్చినాశాలువాలు కప్పినా.ఆ గౌరవం కాపాడుకొని ఇతరులు గౌరవం పొందిన వాడే నిజమైన రచయత నేటి కవులు వారే గొప్ప అనే భ్రమలో ఉండి భజన చేసిఇతరులును హేళనతో బయటకు చిరు నవ్వు లోపట విషపు ఆలోచననాకే సర్వంబొ(వ)చ్చు అనే గర్వపడే మనుషులు వారికి ఏ కళ ఉన్నా అవమాన పడక తప్పదు.రచనలతో రంకెలు వేసిన ఏ కవికి అయినా మంచి హృదయం కావాలి. మేమే నటులం అనే భావన ఉంటే కవికి ఉంటే నేటి సమాజంలో మహా నటులు ఉన్నారు. గౌరవాన్ని గౌరవంగా చూడాలి ఏ కళ ఉన్నా. అదే సంస్కారం.సామాజిక సేవకులు రాముద్రి.గోవింద రావుసెల్: 85008 65056

## ముఖ్యమంత్రి సహాయనిధి
## చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే బేబి నాయన...



విజయనగరం,జిల్లా ప్రతినిధి, బొద్దాన.శ్రీనివాస్...(శుభోదయం న్యూస్):బొబ్బిలి నియోజకవర్గానికి చెందిన పలువురు పౌరుల ఆరోగ్యసమస్యలు మరియు వారి ఆర్ధిక పరిస్థితుల దృష్ట్యా, ముఖ్యమంత్రి గారి సహాయనిధి నుంచి వారికి సాయం అందేలా కృషి చేసి, ఈరోజు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) అందజేశారు:- రామభద్రపురం మండలం, మిర్తివలస గ్రామానికి చెందిన చింతాడ కన్నంనాయుడు గారికి రూ1,39,335/-- ?బాడంగి మండలం, కోటిపల్లి గ్రామానికి చెందిన డోకల వెంకటలక్ష్మి గారికి రూ45,000/--తెర్లాం మండలం, వి.చిన్నయ్యపేటకు చెందిన దత్తి జయమ్మ గారికి రూ81,000/- మరియు చప్ప అప్పలనరసమ్మ గారికి రూ30,000/

## కూడావెళ్లి శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర ఏర్పాట్లను పర్యవేక్షించిన......
## దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి



సిద్దిపేట జిల్లా, (శుభోదయం న్యూస్): అక్బర్ పేట భూంపల్లి మండలంలోని కూడావెళ్లి శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర ఈనెల 29వ తారీకు నుండి ప్రారంభమవుతున్నందున జాతర ఏర్పాట్లను పర్యవేక్షించిన దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి గారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి గారికి ఆలయ పూజారులు ఘన స్వాగతం పలికి, ఆశీర్వచనాలు అందించారు. చెరుకు శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తిచేసి



జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. వారంలోపు కూడావెళ్లి దేవాలయం చైర్మన్ ను నియమిస్తామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీస్, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులకు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, జిల్లా కార్యదర్శి ఏలూరి కమలాకర్, మండల ప్రధాన కార్యదర్శి కోనపురం బాలు యాదవ్, చాట్లపల్లి బాల గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బ్యాగరి నవీన్, మాజీ ఎంపీటీసీలు మంద చంద్రసాగర్, పాతూరి శ్రీనివాస్ గౌడ్, అబ్బుల ఉమారాణి బాల గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోలిపేట ప్రసాద్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు పేదూరి దయాకర్ రెడ్డి, పుద్దోజి ప్రభాకర్ చారి, మండల మహిళా అధ్యక్షురాలు కూతురి సుమలత, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పల్లె అనిల్, దుబ్బాక, రాయపోల్, చేగుంట మండల అధ్యక్షులు కొంగరి రవి, తప్పేట సుధాకర్, వడ్ల నవీన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు అనంతల శ్రీనివాస్, బండారి ఆశ గౌడ్, మైపాల్ యాదవ్,పోతారం ప్రతాప్, బాల్తే వెంకటేశం, ఎల్లన్న గారి సురేందర్ రెడ్డి, ఉత్తం నరేష్, పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్న.....
## దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి



సిద్దిపేట జిల్లా, (శుభోదయం న్యూస్): అక్బర్ పేట భూంపల్లి మండలం పోతారెడ్డి పేట గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో పేద విద్యార్థుల కంప్యూటర్ శిక్షణ కొరకు సిఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి గారు కంప్యూటర్ ల్యాబ్ ను ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ మరియు విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చే ట్రైనర్ ను 15 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసి పోతారెడ్డి పేట హైస్కూల్లో ఉన్న 311 మంది విద్యార్థులకు విద్యతోపాటు కంప్యూటర్ శిక్షణ అందించడం జరుగుతుంది తెలిపారు. పేద విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఉద్దేశంతో వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడానికి కంప్యూటర్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, జిల్లా కార్యదర్శి ఏలూరి కమలాకర్, మండల ప్రధాన కార్యదర్శి కోనపురం బాలు యాదవ్, బ్యాగరి నవీన్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మాజీ ఎంపీటీసీలు మంద చంద్రసాగర్, పాతూరి శ్రీనివాస్ గౌడ్, అబ్బుల ఉమారాణి బాల గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు పేదూరి దయాకర్ రెడ్డి, పుద్దోజి ప్రభాకర్ చారి, మండల మహిళా అధ్యక్షురాలు కూతురి సుమలత, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పల్లె అనిల్, దుబ్బాక, రాయపోల్, చేగుంట మండల అధ్యక్షులు కొంగరి రవి, తప్పేట సుధాకర్, వడ్ల నవీన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు అనంతల శ్రీనివాస్, బండారి ఆశ గౌడ్, మైపాల్ యాదవ్, బాల్తే వెంకటేశం, ఎల్లన్న గారి సురేందర్ రెడ్డి, ఉత్తం నరేష్, పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద విగ్రహావిష్కరణకు జిల్లా కలెక్టర్ కు ఆహ్వానం
## సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి




గుమ్మడిదల, (శుభోదయం న్యూస్): గుమ్మడిదల మండల కేంద్రంలో సిజిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న స్వామి వివేకానంద విగ్రహ ఆవిష్కరణకు ఓపెన్ టు ఆల్ క్రీడా పోటీలకు



సిజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ చెన్నూరు రూపేష్ కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి రావలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, దాసరి ఆంజనేయులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన ఈర్ల రాజు ముదిరాజ్



అమీన్పూర్ (శుభోదయం న్యూస్)భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజి రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన అమీన్పూర్ బిజెపి మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ భారతీయ జనతా పార్టీ జిల్లా రథసారథి గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ అమీన్పూర్ మండలంలో మండల పార్టీ అధ్యక్షులుగా చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. అంతేకాకుండా మండలంలోని సీనియర్ నాయకులను కార్యకర్తలను కలుపుకొని ప్రజల సమస్యల పైన మీరు ముందుండి పోరాడుతున్నారని అన్నారు. రాబోవు రోజుల్లో అమీన్పూర్ మండలంలో కాషాయ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పెట్టుకొని పార్టీ కార్యక్రమాలు తీసుకోవాలని అన్నారు అదేవిధంగా మండలంలో ప్రజలకు ఉన్న సమస్యలను తీర్చే అంతవరకు ప్రభుత్వ అధికారులతో పోరాడాలని అన్నారు.


## ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమలు జరగకుండా
## కఠిన చర్యలు తీసుకోవాలి ఆనంద్ కృష్ణారెడ్డి






జిన్నారం(శుభోదయం న్యూస్):కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని కోరుతూ బొల్లారం బిజెపి పట్టణ అధ్యక్షుడు కెజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. బొల్లారం లో ప్రభుత్వ భూములను క్రీడా ప్రాంగణాల కోసం కేటాయించారు. అలాంటి స్థలాల్లో అనేక అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని వాటిని అడ్డుకొనే వారు ఎవరూ లేరని, అదేవిధంగా అలాంటి స్థలాల్లో ఆక్రమణలు కూడా యధేచ్ఛగా జరుగుతున్నాయని ఆ పిర్యాదు లో పేర్కొన్నారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.సామాజిక భవనాలు నిర్మించడం ద్వారా నిరుపేదల శుభకార్యాలకు, ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అలాంటి భవనాలు అద్దె ద్వారా వచ్చే ఆదాయం మున్సిపల్ అభివృద్ధికి ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. పేదప్రజల అభ్యున్నతికి పాటు పడే అధికారిగా తన అభ్యర్థనను పరిశీలించి, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి కి విన్నవించారు.

## డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ రూల్స్ విడుదల



న్యూఢిల్లీ : డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ - 2023 నిబంధనల అమలుకు సంబంధించిన ముసాయిదా కేంద్రప్రభుత్వం శనివారం విడుదల చేసింది. ఈ చట్టం 14 మాసాల కిందటే ఆమోదించినా నిబంధనలను ఇప్పటివరకూ రూపొందించలేదు. ముసాయిదా పై ఫిబ్రవరి 18 వరకూ ప్రజల అభిప్రాయాలను తీసుకుంటారు. డేటా సేకరించేటప్పుడు వినియోగదారులకు అందించాల్సిన నోటీసు స్వభావాన్ని ముసాయిదా నియమాలు పేర్కొంటున్నాయి. కొన్ని ప్రమాణాలకు లోబడి, ప్రభుత్వం, సంబంధిత శాఖలు సమాచారాన్ని సేకరించవచ్చునని ముసాయిదా తెలిపింది. స్టాటస్టికల్ అవసరాల కోసం సమాచార సేకరణకు మినహాయింపునిచ్చింది. పిల్లల వ్యక్తిగత సమాచారం తీసుకోవాల్సి వస్తే ముందుగా లేదా ఆన్‌లైన్‌లో తల్లిదండ్రుల సమ్మతిని తీసుకోవాలని స్పష్టం చేసింది. ముసాయిదాలో జర్నలిస్టుల భావ ప్రకటనా స్వేచ్ఛకు ఆటంకం కలిగించే కొన్ని నిబంధనలున్నాయి. వ్యక్తిగత డేటా భారత భూభాగం వెలుపలకు బదిలీ చేయబడదు. 2023లో ఉన్న చట్టంలో ఆమోదించబడిన పెనాల్టీ ప్రస్తావన ఈ ముసాయిదాలో లేదు. గరిష్టంగా జరిమానా విధించే నిబంధన ఉంది.

## ఉన్నత విద్యా సంస్థల్లో కుల వివక్షపై చర్యలేవీ

### కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీం కోర్టు ఆదేశం



న్యూఢిల్లీ : దేశంలోని ఉన్నత విద్యా సంస్థ (హెచ్‌ఇఐ)ల్లో కుల వివక్షను అంతమొందించేందుకు తీసుకున్న చర్యల గురించి తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. కుల వివక్ష కారణంగా ఆత్మహత్య చేసుకున్న హైదరాబాద్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల తల్లి రాధికా వేముల, ముంబయి యువ వైద్యురాలు పాయల్ తాద్వీ తల్లి అబేదా సలీం తద్వీలు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిఐఎల్) శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఉన్నత విద్యాసంస్థల్లో సమాన అవకాశాల సెల్‌ల ఏర్పాటుకు సంబంధించి దేశంలోని అన్ని యూనివర్సిటీల నుంచి సమాచా రాన్ని సేకరించి సమర్పించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి)ని ఆదేశించింది. దీంతోపాటు కుల వివక్షకు సంబంధించి ఇప్పటి వరకు ఎన్ని ఫిర్యాదులొచ్చాయి, ఆ ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని కూడా ధర్మాసనం ఆదేశించింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్, న్యాయవాది దివా వాడేకర్ వాదనలు వినిపిస్తూ.. ఉన్నత విద్యా సంస్థల్లో కుల వివక్షను అరికట్టేందుకు సమానత్వ చట్టం-2012లోని నిబంధనలను అమలు చేయడంలో యుజిసి ఘోరంగా విఫలమైందని పేర్కొన్నారు. యుజిసి నిర్లక్ష్యం వల్ల క్యాంపస్‌లలో కుల వివక్ష పెరిగి, విద్యార్థుల ఆత్మహత్యకు దారితీస్తోందని తెలిపారు. ఇందుకు సంబంధించిన కొన్ని గణాంకాలను ఉదహరించారు. ఐఐటిల్లో 2004 నుంచి 2024 వరకు 115 ఆత్మహత్యలు జరిగాయని, ఇది చాలా ఆందోళనకరమైన పరిణామమని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం 820 విశ్వవిద్యాలయాల్లో (సెంట్రల్/ స్టేట్ /డీమ్డ్), ఎన్ని సమాన అవకాశాల సెల్‌లను ఏర్పాటు చేశాయి? ఏర్పాటు చేస్తే ఈ కేసుల పరిస్థితేంటి? 2012లో తీసుకొచ్చిన నిబంధనల అమలుకు సంబంధించి యుజిసి పర్యవేక్షణ ఏమిటి? అని ప్రశ్నించారు. యుజిసి తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. నిపుణుల కమిటీల సిఫార్సుల ఆధారంగా విద్యాసంస్థల్లో కులవివక్షను నిరోధించ దానికి కొన్ని కొత్త నిబంధనలను రూపొందించినట్లు తెలిపారు. ఆ నిబంధనల కాపీని సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సున్నితమైన అంశాన్ని క్రమపద్ధతిలో పరిష్కరించాలని నొక్కి చెప్పారు. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణను నాలుగు వారాలపాటు వాయిదా వేసింది.

## చైనాలో కొత్త వైరస్ కలకలం!



బీజింగ్ : చైనాలో కొత్త వైరస్ కలకలం రేపింది. ఈ వైరస్‌ను 'మెటా న్యూమో వైరస్' (ఎంవిపి) గా పిలుస్తున్నారు. 2001లోనే దీనిని గుర్తించామని అంటున్నారు. దీని బారిన పడినవారు జలుబు, దగ్గు, శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఇబ్బందిపడుతున్నారు. ఈ వైరస్ లక్షణాలుగా వీటిని భావిస్తున్నారు. ఉత్తర చైనాలో ఈ ఇన్‌ఫెక్షన్ ఎక్కువగా వుంది. ఈ నేపథ్యంలో చైనాలో పరిస్థితులపై ఆసియా దేశాలు దృష్టి సారించాయి. కరోనాకు ఎలాంటి లక్షణాలైతే వున్నాయో ఆలాంటి లక్షణాలే ఈ వైరస్‌లో కూడా కనిపిస్తున్నాయని, రోగ నిరోధక శక్తి తక్కువగా వున్నవారు వీటి బారిన పడే అవకాశం వుందని డాక్టర్లు చెబుతున్నారు. చైనాలో వైరస్ వార్తలను నిశితంగా పరిశీలిస్తున్నామని కేంద్ర ఆరోగ్య శాఖ పేర్కొంది. 14ఏళ్లలోపు వయసు గల పిల్లల్లో హెచ్‌ఎంవిపి కేసులు పెరిగాయని, అంతర్జాతీయ సంస్థలతో దీనిపై నిరంతరంగా మాట్లాడుతున్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సిడిసి) అధికారి ఒకరు తెలిపారు. భారత్‌లో ఇప్పటివరకు ఇలాంటి కేసులేవీ లేవని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అతుల్ గోయల్ చెప్పారు.

## కాలిఫోర్నియాలో విమాన ప్రమాదం

### ఇద్దరు మృతి, 18 మంది గాయాలు



శాన్‌ఫ్రాన్సిస్కో: కాలిఫోర్నియాలోని ఓ వాణిజ్య భవనంపై విమానం కూలిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా, 18 మంది గాయపడ్డారు. లాస్ ఏంజిల్స్‌కు ఆగ్నేయంగా 25 మైళ్ల దూరంలో ఉన్న ఫుల్లెర్టన్ మున్సిపల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని వాణిజ్య భవనంపై విమానం కూలిపోయిందని అధికారులు తెలిపారు. దీంతో భవనంలోని ప్రజలను ఖాళీ చేయించారు. 10 మంది గాయాలతో ఆసుపత్రి పాలయ్యారని, ఘటనా స్థలంలో ఎనిమిది మందికి చికిత్స అందించారని ఫుల్లెర్టన్ పోలీస్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి క్రిస్టీ వెల్స్ తెలిపారు. విమానంలో ఎంతమంది ఉన్నారో స్పష్టంగా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు విచారణ ప్రారంభించింది.

# అది 'మినీ భారత్'!



దేవతల దేశంగా పిలువబడే నేల కేరళ. అంతేకాదు, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా చెప్పబడే నేల. అనేక మతాలు, జాతులు, ప్రజలతో సహజీవనం చేస్తున్న సహనశీల తలం. వందశాతం సంపూర్ణ అక్షరాస్యత, సామాజిక చైతన్యంతో భాసిల్లుతున్న భూమి. చతాంబి స్వామి, శ్రీ నారాయణగురు, అయ్యన్‌కాళీ లాంటి సంఘ సంస్కర్తలు నడయాడిన నేల. ప్రగతిశీల సామరస్య పాలనలో దేశంలోనే ప్రత్యేకత సంతరించుకున్నది కేరళ. అలాంటి రాష్ట్రంలో ఆదినుంచి విద్వేష కుంపటి రగిలించాలను కుంటున్నది ఆరెస్సెస్-బీజేపీ. శబరిమల వివాదం ఒక ఎత్తయితే 'ది కేరళ స్టోరీ' వరకు అంతా అట్టర్ ఫ్లాపే. నిరంతరం లౌకికత్వాన్ని చాటే అక్కడి ప్రజలు ఎప్పటికప్పుడు విద్వేషపు కుట్రల్ని తిప్పి కొడుతూనే వున్నారు.అయినప్పటికీ సంఘ్ పరివార్ ఆశ చావడం లేదు. అవకాశం దొరికినప్పుడే కాదు, వీలు కల్పించు కుని మరీ విద్వేషాగ్ని రగిలి స్తున్నది. మొన్నటికి మొన్న మహారాష్ట్ర మంత్రి నితీష్‌రాణే కేరళను 'మినీ పాకిస్థాన్' అంటూ చేసిన వ్యాఖ్య 'హిందుత్వ' పడగను మరోసారి తట్టిలేపింది. మతం పేరుతో ప్రజల్ని విభజిస్తూ పాలించాలనే వ్యూహాన్ని బహిర్గతపరిచింది. లౌకికవాదం, మత సామరస్యానికి కంచుకోట అయిన కేరళపై సంఘ్ పరివార్ చేసే విద్వేష ప్రచారాన్ని వెల్లడిచేసింది. బీజేపీకి చెందిన ఆ మంత్రి కాంగ్రెస్ అగ్రనేతలను ఉద్దేశించి 'కేరళ మినీ పాకిస్థాన్ అయినందునే వయనాడ్ నుంచి వారిద్దరు ఎంపీలుగా ఎన్నికయ్యారు' అని వ్యాఖ్యానించారు. ఒక మంత్రి ఇంకొక రాష్ట్రంపై చేసిన ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అంతరార్థమేంటి? లౌకికవాదులైన భారత ప్రజలను ఎటుతిప్పదలుచుకున్నారు కాషాయపు నేతలు. చట్టసభల్లో ప్రజాప్రతినిధిగా ఎన్నికైనవారు భారతదేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడతానని, రాగ ద్వేషాలకతీతంగా పాలన అందిస్తానని రాజ్యాంగం మీద ప్రమాణం చేస్తారు. కానీ, మంత్రి రాణే వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే కాదు, మత సామరస్యానికి తీవ్ర విఘాతం కూడా. ఇలాంటివారికి మంత్రిగా కొనసాగే నైతిక హక్కు ఉందా? కేరళ రాష్ట్రం పాకిస్థాన్‌లోనే ఉన్నట్టుగా మాట్లాడిన తీరు తీవ్ర అభ్యంతరకరం. రాణే వ్యాఖ్యలు దేనికి సంకేతమో ప్రధాని నరేంద్రమోడీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ లు సమాధానం చెప్పాలి. ఎక్కడపడితే అక్కడే బీజేపీ-సంఘ్ పరివార్ నేతలు బహిరంగ సభల్లో, సదస్సుల్లో మతోన్మాద విషాన్ని చిమ్ముతుంటే భిన్నత్వంలో ఏకత్వం రోజురోజుకూ ప్రశ్నార్థకమవుతున్నది. ఇది ఒక్క హిందువులనో, ముస్లింలనో కాదు, ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. లౌకికవాదానికి, ప్రగతిశీల సమైక్యభావనకు పర్యాయపదంగా నిలిచే కేరళపై విద్వేష వ్యాఖ్యలు సిగ్గుచేటు. కేరళ అంటేనే ప్రగతి. అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతూ దేశాన్ని ఆకర్షిస్తున్నది. ఇది సంఘ్ పరివార్‌కు అస్సలు రుచించడం లేదు. అందుకే వామపక్షాల ఏలుబడిలోని 'ఎల్‌డీఎఫ్'ను ఎదుర్కోలేక విద్వేషాలతో ప్రజల్ని విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తున్నది. పైగా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులకూ కొర్రీలు పెడుతున్నది. రాయితీలు తగ్గించి పన్నుల భారం మోపుతున్నది. కేంద్ర భారాలు, హెచ్చుతగ్గులు ఎలా ఉన్నా తమ రాష్ట్రానికి లాభమా, నష్టమా అని బేరీజు వేసుకున్న తర్వాతే అక్కడ అమలుకు సిద్ధపడుతున్నది కేరళ సర్కార్. 'కులం, మతం, జాతీయత ఆధారంగా చేసే విద్వేష ప్రసంగాలు రాజ్యాంగం ఉపదేశించిన సౌభ్రాతృత్వానికి సవాళ్లు విసరడమే కాదు, దేశ ఐక్యతనూ దెబ్బతీస్తాయి' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా గుజరాత్‌లో ఇటీవల నిర్వహించిన ఓ సదస్సులో ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవంగా చూస్తే కూడా దేశం చాలా ప్రమాదకరమైన స్థితిలో ఉందని చెప్పడానికి ఇటీవల పార్లమెంట్‌లో అమిత్‌షా అంబేద్కర్ మీద చేసిన వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. అంతేకాదు, ఉత్తరప్రదేశ్‌లో ఈనెల పదమూడు నుంచి ప్రారంభం కానున్న మహాకుంభమేళాలో హిందూయేతరులకు దుకాణాలు కేటాయించవద్దని అఖిల భారతీయ అఖాడా పరిషత్ చీఫ్ మహంత్ రవీంద్ర పురీ వ్యాఖ్యా నించారు. 'వాళ్లు ఎక్కడబడితే అక్కడ ఉమ్మిలేస్తారు.. మూత్రం పోస్తారు. పవిత్ర మహాకుంభమేళా అపవిత్రం అయిపోతుంది.' అన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే బీజేపీ-ఆరెస్సెస్ నిలువెల్లా మతోన్మాద విషాన్ని నింపుకుని పాలన సాగిస్తోంది. ఈ విభజన సిద్ధాంతాలు, ఆర్థిక అసమానతలు, ప్రజల్ని ఐక్యంగా ఉంచలేవు. పైగా అట్టడుగువర్గాలకూ సామాజికన్యాయాన్ని అందించలేవు. తిరోగమన విధానాలకు నెలవైన మనుస్మృతిని వల్లెవేస్తూ విద్వేషవ్యాఖ్యలు చేసే వారి విషపు కోరల్ని ప్రజలే పీకి పారేయాలి.

# ఎన్నాళ్లీ మారణహోమం...



ఉధృతమైన మారణహోమంగా 2024 సంవత్సరం చరిత్రలో నిలిచిపోయినా కానీ, కొన్ని ధనిక, అత్యంత శక్తివంతమైన సంస్థలు మాత్రం ఈ మారణహోమం సాధారణమైనదే అన్న భావనతో ఉంటున్నాయి. ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణహోమానికి పాశ్చాత్య ప్రభుత్వాలు నివారించే ప్రయత్నాలు చేపట్టడం లేదు. ప్రపంచంలో అగ్రరాజ్యం అమెరికా కూడా ఇజ్రాయెల్ రణజ్వాలలతో చలికాచుకుంటోంది. ప్రధాన స్రవంతి మీడియా సైతం గాజాలోని ఇజ్రాయెల్ మారణహోమాన్ని ప్రేక్షకునిలా చూస్తోంది. మొత్తం మీద ఏ దేశమూ ఇజ్రాయెల్‌కు యుద్ధ విరమణకు పిలుపు ఇవ్వకుండా వెనుకంజ వేస్తున్నాయి. 14 నెలలుగా గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఆపలేకుంటున్నాయి. ఆక్రమిత పాలస్తీనా భూభాగం వెస్ట్‌బ్యాంక్ నుంచి అణచివేతలను అడ్డుకోలేకుంటున్నాయి. అలాగే ఎలాంటి హెచ్చరికలు లేకుండా లెబనాన్‌లో సాగుతున్న దాడులను నిలువరించలేకుంటున్నాయి. ఈ 14 నెలల్లోనే 45,000 మంది కన్నా ఎక్కువ సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. వీరిలో అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులే ఉండడం గమనార్హం. ఈ దారుణాలపై ప్రపంచ దేశాలు మౌనం పాటించడం బాధ్యతారాహిత్యమైన సంక్లిష్టతే కాదు ఎంతో నష్టదాయకం. దీనికి తోడు మరో వాస్తవ విషయం ఏమిటంటే ఇజ్రాయెల్ సాగిస్తున్న దాడులకు కావలసిన ఆయుధాలు సరఫరా చేస్తున్నది అమెరికాయే. ఇటీవల యెమెన్ నుంచి వచ్చిన హౌతీ బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకోవడానికి మొట్టమొదటిసారి థాడ్ (టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్) అనే బ్రహ్మాస్త్రాన్ని ఇజ్రాయెల్ ప్రయోగించింది. థాడ్ భారీ క్షిపణి వ్యవస్థను రూపొందించింది అమెరికాయే. దీన్ని బట్టి ఇజ్రాయెల్ మారణహోమానికి పరోక్షంగా అమెరికా ఏ విధంగా సహకరిస్తోందో తెలుస్తుంది. ఈ మారణహోమం రెండో ప్రపంచ యుద్ధకాలం నాటి బీభత్సకాండను గుర్తుకు తెస్తోందని శాంతికాముకులు ఆక్షేపిస్తున్నారు. పాలస్తీనాకు ప్రత్యేక పాత్రికేయులుగా వ్యవహరిస్తున్న ఫ్రాన్‌కెస్కా అల్బనీస్ ఇజ్రాయెల్ హత్యలకు కచ్చితమైన పదం మారణహోమమేనని వ్యాఖ్యానించారు. డిసెంబర్ 26న ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ టెడ్రోస్ అథనామ్ ఘెబ్రోయెసెస్, ఆయన బృందం యెమెన్‌లోని సనా విమానాశ్రయం వద్ద ఉండగా ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరగడం అత్యంత దారుణం.దాడుల నుంచి కొన్ని మీటర్ల దూరంలోనే తప్పించుకుని వీరు బయటపడడం మానవతా వాదులందరికీ ఆందోళన కలిగించింది. యెమెన్‌లోని సనా విమానాశ్రయాన్ని ఇజ్రాయెల్ టార్గెట్ చేసుకోవడం వల్లనే ఈ సంఘటన జరిగింది. ఈ దాడిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందన్న దానికి ఉదాహరణ ఇది మొదటిసారి కాదు, సెప్టెంబరులో ఇజ్రాయెల్ అక్రమంగా ఆక్రమించుకున్న తన ఆక్రమిత ప్రాంతాల నుంచి తక్షణం వైదొలగాలన్న ఐక్యరాజ్య సమితి తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందినా ఫలితం కనిపించలేదు. ప్రపంచ సమస్యల పరిష్కారంలో ఐక్యరాజ్యసమితి ప్రయత్నాలు ఏమాత్రం ఫలించని నిరుత్సాహపరిచే నిష్క్రియకు ఇది మరో తార్కాణంగా నిలిచిపోయింది. ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెతన్యాహుపై అవినీతి ఆరోపణలు కోర్టు వరకు అతన్ని దోషిగా తీసుకువచ్చినా ఆ దేశ శాసన వ్యవస్థ నుంచి ఆయనకు కొంత మినహాయింపు కనిపిస్తోంది. నెతన్యాహుపై అవినీతి, మోసం, నమ్మకద్రోహం వంటి కేసులు ఉన్నా అతడ్ని ఏమీ చేయలేకపోతున్నాయి. తనపై అవినీతి ఆరోపణలు అర్థరహితమని, తాను నిబద్ధతగల నాయకుడినని, ఇజ్రాయెల్ ప్రయోజనాల రక్షకుడినని నెతన్యాహు తన వాదాన్ని బలంగా వినిపిస్తున్నారు. ఇజ్రాయెల్ దేశాన్ని రక్షించే క్రమంలో ఇలాంటి ఆరోపణలు చేయడమంటే సముద్రంలో నీటి చుక్కను వేయడమేనని వ్యాఖ్యానించారు. భద్రతా కారణాల దృష్ట్యా రహస్య బంకర్‌లో ఆయన ఇటీవల విచారణకు హాజరయ్యారు. కీలకమైన యుద్ధ సమయంలో ప్రధానిగా బాధ్యతలను నిర్వహిస్తూనే విధిగా కోర్టుకు హాజరయ్యానని తన సాహసాన్ని మరోసారి చెప్పుకున్నారు. ఇజ్రాయెల్ చట్టాల ప్రకారం దోషిగా తేలినా ప్రధాని రాజీనామా చేయవలసిన అవసరం లేదు. గాజాలో ఏర్పడిన మానవతా సంక్షోభాన్ని నివారించాలంటూ భారత్ కూడా పలుమార్లు పిలుపునిచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా పాలస్తీనియన్ల సంక్షేమం కోసం 2.5 మిలియన్ డాలర్ల (రూ. 20.83 కోట్లు) సాయం విడుదల చేసింది. పాలస్తీనా శరణార్థుల కోసం పని చేసే ఐక్యరాజ్యసమితి సంస్థ (యుఎన్ఆర్‌డబ్ల్యుఎ)కు భారత్ విరాళం అందజేసింది. యుఎన్ఆర్‌డబ్ల్యుఎకు వార్షికంగా 5 మిలియన్ డాలర్ల సాయం అందజేస్తామని భారత్ 2018లోనే హామీ ఇచ్చింది. ఇందులో భాగంగానే 2023 24 సంవత్సరానికి సంబంధించి తొలి విడతగా 2.5 మిలియన్ డాలర్లను అందజేసింది. విద్య, వైద్యం వంటి వాటికి ఐక్యరాజ్య సమితి సంస్థ ఈ నిధులను వెచ్చించనుందని వెస్ట్‌బ్యాంక్ రామల్లాలోని భారత ప్రతినిధి తెలిపారు. పాలస్తీనాకు సహాయం అందించే అలాంటి ఐరాస సంస్థను వ్యతిరేకిస్తూ ఇజ్రాయెల్ పార్లమెంట్ నెస్సెట్ తీర్మానించడం గర్హనీయం. పాలస్తీనా రాజ్యస్థాపనకు ఇజ్రాయెల్ వ్యతిరేకిస్తోంది. ప్రపంచ దేశాలు ఇజ్రాయెల్ మారణహోమాన్ని నివారించడానికి చొరవ తీసుకోకుంటే మరింత అధ్వాన పరిస్థితులు ఏర్పడి మానవత్వమన్నది అసలు చిరునామా లేకుండాపోతుంది. 2024 అత్యంత విషాద ఘట్టంగా గడిచిపోయింది. ఇప్పుడీ కొత్త సంవత్సరంలోనైనా ఇజ్రాయెల్ వంటి రణపిపాస దేశాలకు తగిన ప్రాయశ్చితం కలగాలని మేధావులు కాంక్షిస్తున్నారు.

# సమ్మెబాటలోనే సమగ్ర శిక్ష ఉద్యోగులు



ఇరవయ్యవ శతాబ్దంలో వచ్చిన ఎన్నో పోరాటాల ఫలితంగా బానిసత్వం, వెట్టిచాకిరి రద్దు అయ్యాయి. తరువాత కాలంలో ఎన్నో ఉద్యమాల ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గాలు అనేక హక్కులు సాధించుకున్నారు. 1991లో ఆర్థిక సంస్కరణలో భాగంగా మన దేశంలో ప్రారంభమైన లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గాల హక్కులను కాలరస్తూ, కార్పొరేట్ శక్తులకు రెడ్‌కార్పెట్ వేస్తూ, కార్మిక చట్టాలను సరళీకరిస్తూ, ఉద్యమాల ద్వారా సాధించుకున్న హక్కులను రద్దు చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహించే అనేక పథకాల్లో, స్కీములలో కాంట్రాక్టు విధానం రాజ్యమేలుతుంది. ఆశ, అంగన్‌వాడి, సమగ్రశిక్ష, కెజిబివి, యుఆర్ఎస్ ఇలా అనేక విభాగాల్లో ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతి ద్వారానే నియమిస్తున్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య, జీవిత బీమా సౌకర్యం, రిటైర్మెంట్ ప్రయోజనాలు తదితర సౌకర్యాలు వీరికి ఉండవు. సర్వీస్‌లో మరణిస్తే ఉద్యోగి కుటుంబానికి భద్రతాఉండదు. ప్రజాసంక్షేమం కోసం అనేక పథకాలు ప్రారంభిస్తున్న ప్రభుత్వాలు, ఆ పథకాలు అమలు చేసే ఉద్యోగుల సంక్షేమాన్ని గాలికి వదిలేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ ఆదర్శవంతంగా ఉండాల్సిన ప్రభుత్వాలే దశాబ్దాల కాలంగా కాంట్రాక్టు ఉద్యోగుల సేవలను దోపిడీ చేస్తుంటే వారికి న్యాయం చేసేది ఎవరు? సమగ్రశిక్ష అభియాన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్య పథకం. దీని కింద గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో సుమారు 19,350 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. మండల వనరుల కేంద్రంలో సిసిఒలు, ఎమ్ఐఎస్ కోఆర్డినేటర్లు, మెసేంజర్లు భవిత కేంద్రాలలో ప్రత్యేక ఉపాధ్యాయులు (ఐఇఆర్‌పిలు), స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సిఆర్‌పిలు, పాఠశాల స్థాయిలో పిటిఐఎస్‌లు. కెజిబివిలో స్పెషల్ ఆఫీసర్లు, పిజిసి ఆర్‌టిలు, సిఆర్‌టిలు, పిఇటిలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎఎన్ఎంలు, డిపిఒ కార్యాలయంలో ఎపిఒలు, సిస్టం ఎనాలసిస్టులు, డిపిఒ ఆపరేటర్లు, అటెండర్లు తదితరులు సమగ్ర శిక్షలో కాంట్రాక్టు విధానంపై పని చేస్తున్నారు. వారికి కనీస వేతనాలు లేక, భీమా సౌకర్యం లేక రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేక, ఆధునిక బానిసత్వాన్ని, వెట్టిచాకిరి అనుభవిస్తున్నారు. ఇప్పటికే వివిధ పద్ధతుల్లో వారెన్నో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వాలు ఎన్ని హామీలు ఇచ్చినా అవి నేటికీ నీటిపై రాతలుగానే మిగిలిపోయాయి. కేంద్రంపై రాష్ట్రం, రాష్ట్రంపై కేంద్రం నెపం నెట్టుతూ సమగ్రశిక్ష ఉద్యోగుల శ్రమను దోపిడీ చేస్తున్నాయి. సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, విద్యాశాఖలో విలీనం చేసి పే స్కేల్ అమలు చేయాలని, ప్రతి ఉద్యోగి జీవిత బీమా, ఆరోగ్య బీమా కల్పించి 20 లక్షల ఎక్స్‌గ్రేషియో కల్పించాలని, సిఎం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, విధి నిర్వహనలో మరణించిన ఉద్యోగులకు 20 లక్షల ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని, డిఎస్‌సి నియామకాల్లో 30% వెయిటేజ్ ఇవ్వాలని, పదవీ విరమణ బెనిఫిట్స్ కల్పించాలని గత 21 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడం విచారకరం. మరోపక్క కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయొద్దని హైకోర్టు చెప్పిందని జిఒ నెంబర్ 16 గురించి కొందరు మాట్లాడుతున్నారు. అది కేవలం కాంట్రా క్టు జెఎల్ రెగ్యులరైజేషన్ విషయంలో హైకోర్టు చెప్పిన్న తీర్పు. వారు రిటర్న్ ఎగ్జామ్ ద్వారా నియామకం కాలేరు, రోస్టర్ పాయింట్లు పాటించలేరు, రెగ్యులర్ ఉద్యోగుల స్థానంలో వారు నియమించబడ్డారు. కాబట్టి నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో హైకోర్టు ఆ తీర్పు ఇచ్చి ఉండవచ్చు. కానీ సమగ్రశిక్ష ఉద్యోగులు రాత పరీక్ష ద్వారా, రోస్టర్ కమ్ మెరిట్ ప్రకారం నియామకం అయ్యారు. అంతకు ముందు వారి స్థానాల్లో రెగ్యులర్ ఉద్యోగులు ఎవ్వరూ లేరు, కాబట్టి నిరుద్యోగులకు నష్టం లేదు. సాంకేతికంగా హైకోర్టు తీర్పు సమగ్ర శిక్ష ఉద్యోగుల సేవల క్రమబద్ధీకరణకు అడ్డంకి కాకపోవచ్చు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన మోడల్ స్కూల్ వ్యవస్థను ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకొని నిర్వహిస్తున్నట్లు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగ, ఉపాధ్యాయులను విద్యా శాఖలో విలీనం చేసి వారి సేవలు క్రమబద్ధీకరణ చేయవచ్చు. లేక రాష్ట్రంలో ఉన్న వివిధ గురుకుల సొసైటీలవలె సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను ఒక ప్రత్యేకమైన సొసైటీగా రూపొందించి నిర్వహించడం ద్వారా వారి సేవలు క్రమబద్ధీకరణ చేయవచ్చు. ఆర్థిక సంస్కరణల అభివృద్ధి ఫలాలు అన్నివర్గాల ప్రజలకు అందాలే కాని కొన్ని వర్గాల ప్రజలను కట్టుబానిసలుగా, వెట్టి చాకిరిలోకి నెట్టివేయరాదు.